ప్రజాశక్తి

బుధవారం 8 నవంబరు 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





తీవ్ర వర్షాభావం

- సాగునీటి సరఫరాకు చర్యలు శూన్యం
- ఎన్టీఆర్ జిల్లాలో 3.6 లక్షల ఎకరాల్లో సాగు



ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ఎన్టీఆర్ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడానికి ప్రభుత్వమే ప్రధాన కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయానికి అవసరమైన సాగు నీటిని అందించడంలోను, అందుకు అవసరమైన చర్యలు చేపట్టడంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. జిల్లాల పునర్విభజన అనంతరం ఎన్టీఆర్ జిల్లాలో వ్యవసాయం రంగం, సాగు నీరు సరఫరాను ప్రాధాన్యతగా గుర్తించడంలోను జిల్లా యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఎన్టీఆర్ జిల్లాలో వ్యవసాయ రంగం తయారైంది. ప్రకాశం బ్యారేజీ, ఎగువన నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు ఉన్నా సాగు నీరు అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. మరో వైపు కృష్ణా డెల్టా ప్రాంతం ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న ప్రకాశం బ్యారేజీ నుంచే ప్రారంభం అవుతుంది. అయినా 90 శాతం నీటిపారుదలకు తగిన వ్యవస్థ లేదు. కృష్ణా డెల్టాలో మొత్తం 7.36 లక్షల ఎకరాలు సాగులో ఉన్నాయి. తూర్పు డెల్టాలోని ముఖ్య కాల్వలు విజయవాడ నుంచే ప్రారంభమవుతాయి. రైవస్, ఏలూరు, బందరు కాల్వలు వీటిలో ప్రధానమైనవి. వీటి ద్వారానే వ్యవసాయానికి సాగునీరు అందిస్తున్నారు. తద్వారా కృష్ణా, ఏలూరు జిల్లాలకు సాగు, తాగునీరు అందుతోంది. రైవస్ కాల్వ కింద సుమారు 3.5లక్షల ఎకరాలు, బందరు కాల్వ కింద దాదాపు 1.5 లక్షల ఎకరాలు, ఏలూరు కాల్వ కింద 1.6 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈ భూములన్నీ కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ఉన్నాయి. కానీ ఎన్టీఆర్ జిల్లాలో వ్యవసాయ రంగానికి పెద్దగా ఉపయోగపడటం లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 3.65 లక్షల ఎకరాల భూమి సాగుకు అవకాశం ఉంది. అయితే వీటిలో అధిక శాతం మెట్ట భూములు. వరితోపాటు పత్తి, పెసలు, మొక్క జొన్న, మిర్చి వంటి పంటల సాగు చేస్తుంటారు. ఈ ప్రాంతాలకు సాగు నీరు అందించేందుకు ప్రత్యేక ప్రాజెక్టులు అంటూ ఏమీ లేవు. చెరువులే ప్రధాన వనరులు. నాగార్జున సాగర్ కాల్వల ద్వారా కొన్ని ఎకరాలకు నీరు వస్తుంది. అయితే ఆ కాల్వలకు నీటి సరఫరా లేకపోవడంతో వర్షాలపైనే ఆధారపడి సాగు చేయాల్సి వస్తోంది. వానలు సరిగా పడకపోవడంతో అన్ని మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా వ్యవసాయానికి సరిపడిన సాగు నీరు అందించే చర్యలు చేపట్టక పోతే వ్యవసాయ రంగంలో ఎన్టీఆర్ జిల్లా వెనుబడే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

బస్సు ప్రమాదం దురదృష్టకరం : కలెక్టర్



ప్రజాశక్తి-విజయవాడ : పిఎన్ బస్టాండ్‌లో సోమవారం జరిగిన ఘటన దురదృష్టకరమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ఆర్‌టిసి బస్సు ప్లాట్‌ఫారంపైకి దూసుకెళ్లిన ప్రాంతాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో ఈ తరహా ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. ప్రధానంగా ప్లాట్‌ఫారాల ఎత్తు పెంచడం, నైపుణ్యం కలిగిన డ్రైవర్ల నియామకానికి జాగ్రత్తలు తీసుకోవడం, ప్రతి బస్సు కండిషన్‌లో ఉండేలా చూడటం, బస్సుల మరమ్మతు విభాగాన్ని పటిష్ట చేయడం వంటి చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదంలో క్షతగాత్రులైన ప్రయాణికులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం చాలా వేగంగా స్పందించి మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం ప్రకటించిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కలెక్టర్‌తోపాటు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ యంవై. దానం, డిప్యూటీ సిటిఎం బషీర్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

దుర్గగుడి అభివృద్ధికి రూ.200 కోట్లతో ప్రణాళిక : డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ : దుర్గగుడి ఇంద్రకీలాద్రిపై సుమారు రూ.200 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి సమగ్ర అభివృద్ధికి ముసాయిదా ప్రణాళికను మంగళవారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధి, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనుల్లో సందర్శకుల సౌకర్యాలే గీటురాయిగా తీసుకోవాలన్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఉండే రద్దీతోపాటు దసరా మహోత్సవాలు, భవానీ దీక్షల విరమణ రోజుల్లో దర్శనానికి తరలివచ్చే వారికి అనుగుణంగా అధునాతన సౌకర్యాలు కల్పించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి (మిగతా 6లో)

డెల్టా ఆధునీకరణపై నిర్లక్ష్యం

సాగు,తాగునీటికి కటకట ✿ పారిశ్రామిక ప్రగతి శూన్యం ✿ సిఎం హామీలు నీటిమూటలే



అభివృద్ధి చెందని మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కృష్ణాడెల్టా ఆధునీకరణపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఎండ వస్తే ఎండటం, వానలొస్తే మునగడం అన్న చందంగా పంటల పరిస్థితి తయారైంది. కృష్ణానది పరీవాహక ప్రాంతంలోనే ఉన్నా సాగు, తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ల్యాండ్ బ్యాంకులు సేకరించి పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసినా పరిశ్రమలు ఏర్పాటు కాలేదు. యువతకు ఉపాధి ఎండమావిగా మారింది.

వ్యవసాయ ప్రధానమైన కృష్ణాజిల్లాలో కాల్వలు, డ్రైన్ల ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు బడ్జెట్లలో రూ.1340.62 కోట్లు కేటాయించింది. అయితే కేవలం రూ.244.73 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఏటా తూడు, సిల్ట్ తొలగింపు, కట్టల పటిష్టత, మరమ్మతులు సకాలంలో పూర్తి చేయడంలేదు. దీంతో ఈ ఏడాది జూలై ఆఖరులో కురిసిన వర్షాలకు 1.25 లక్షల ఎకరాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. పొలాల్లో నీరు రోజులతరబడి కదలకపోవడంతో ముంపునకు గురైన వరి పంట పనికిరాకుండా పోయింది. అత్యధిక విస్తీర్ణంలోని పొలాల్లో తిరిగి నాట్లు వేయాల్సి వచ్చింది. మరోవైపు అక్టోబర్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో కాల్వల చివరి భూములకు నీరందలేదు. దీంతో కోడూరు, నాగాయలంక, కృత్తివెన్ను, గుడివాడ, గుడ్లవల్లేరు, కంకిపాడు, ఉయ్యూరు తదితర మండలాల్లోని వందలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. జలజీవన్ మిషన్‌లో భాగంగా కృష్ణాజిల్లాలో లక్షా 60 వేల గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ రూ.750 కోట్లతో 14 మండలాల్లో ఇంటింటికీ నీటి కుళాయి ఏర్పాటుకు చేసిన ప్రతిపాదనలు అక్కరకు రాలేదు. సముద్రతీర ప్రాంత మండలాల్లో ఉప్పునీరు తప్ప మంచినీరు దొరకని పరిస్థితి నెలకొంది. ఆక్వా చెరువులు విస్తరించిన మండలాల్లో మంచినీటి చెరువులు, భూగర్భ జలాల్లోని నీరు కలుషితమైంది. ఈమండలాల్లోనూ తాగునీటిని కొనుగోలు చేసి తాగాల్సి వస్తోంది.

పారిశ్రామిక వృద్ధి శూన్యం

జిల్లాలో లక్షా 20 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. గతంలో వరి పంట సాగైన 70 వేల ఎకరాల వ్యవసాయ భూములు ఆక్వా చెరువులుగా మారాయి. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ (హార్వెస్టింగ్ యంత్రాలు) పెరగడంతో వ్యవసాయ కార్మికుల పనిదినాలు కుదించుకుపోతున్నాయి. కార్మికులకు ఏడాదిలో మూడు నెలలపాటు వ్యవసాయ పనులు దొరకడం గగనంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాకు భారీగా పెట్టుబడులు తీసుకొచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని పాలకులు చెబుతున్న మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు. బాపులపాడు మండలం మల్లవల్లిలో మోడల్ ఇండస్ట్రియల్ పార్కు (మిగతా 6లో)

అసమానతలు లేని అభివృద్ధి కోసం CPM ప్రజారక్షణ భేరి

నేడు ప్రజారక్షణభేరి బస్సు యాత్ర

కృష్ణాజిల్లాలో ప్రవేశం, ఎన్‌టిఆర్ జిల్లాలో ముగింపు

అసమానతలు లేని అభివృద్ధి కోసం రాష్ట్రంలో సిపిఎం చేపట్టిన ప్రజారక్షణభేరి బస్సు యాత్రలు బుధ, గురువారాల్లో కృష్ణాజిల్లాలోకి ప్రవేసిస్తున్నాయి. 8,9,10 తేదీల్లో మూడు రోజులపాటు జిల్లాలో యాత్రలు కొనసాగుతాయి. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో ముగుస్తాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో పార్వతీపురం జిల్లా సీతంపేటలో ప్రారంభమైన యాత్ర ఏలూరు జిల్లా మీదుగా బుధవారం ఉదయం 8 గంటలకు బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ వద్ద కృష్ణాజిల్లాలోకి ప్రవేశిస్తుంది. వీరవల్లి, అంపాపురం మీదుగా 10.30 గంటలకు ఉంగుటూరు మండలం చేరుకుంటుంది. తేలప్రోలు, ఉంగుటూరు, నాగవరప్పాడు, వెన్నూతల, గన్నవరం మండలం దావాజీగూడెం, అల్లాపురం మీదుగా గన్నవరం చేరుకుంటుంది. గన్నవరంలో 12 గంటలకు సభ జరుగుతుంది. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు గూడవల్లిలో యాత్ర ఎన్‌టిఆర్ జిల్లాలోకి యాత్ర ప్రవేశిస్తుంది. ఈ సందర్భంగా పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన రామవరప్పాడు నుంచి విజయవాడ లెనిన్ సెంటర్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తారు. లెనిన్ సెంటర్‌లో సాయంత్రం ఆరు గంటలకు ఈ జాతా ముగింపు సభ జరుగుతుంది.



మచిలీపట్నంలో

రైతుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి

- ఎన్‌టిఆర్, కృష్ణా కలెక్టర్లు డిల్లీరావు, రాజాబాబు
- లబ్ధిదారులకు రైతు భరోసా జమ

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా వివిధ ప్రణాళికలు రూపొందిస్తూ వారి అభ్యున్నతికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు ఎస్.డిల్లీరావు, పి.రాజాబాబు పేర్కొన్నారు. రైతులు ఆనందంగా ఉంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందనే దృఢ నిశ్చయంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా – పిఎం కిసాన్ కింద వరుసగా ఐదో ఏడాది రెండో విడత ఆర్థికసాయం నగదును రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ఎన్‌టిఆర్ జిల్లాకు సంబంధించి విజయవాడ రూరల్ మండలం కుందావారి కండ్రిక నుండి కలెక్టర్ ఎస్.డిల్లీరావు, కృష్ణాజిల్లాకు సంబంధించి మచిలీపట్నంలోని జడ్‌పి సమావేశపు మందిరం నుండి కలెక్టర్ పి.రాజాబాబు వర్చువల్ విధానంలో వీక్షించారు. సిఎం ప్రసంగం అనంతరం ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 1,41,276 మంది రైతులకు రూ.59.29 కోట్ల ఆర్థిక సహాయం చెక్కును కలెక్టర్ ఎస్.డిల్లీరావు రైతులకు అందజేశారు. తొలుత జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దామోదరరెడ్డి, డిప్యూటీ మేయర్ అవుతూ శ్రీ శైలజారెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు టి.శ్రీకాంత్, మనోజ్‌కొఠారి, జమలపూర్ణమ్మ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.నాగమణెమ్మ, ఎపియంఐపి పీడీ సూభాని, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె.బాలాజీ కుమార్, ఏపిఎస్ఎంఎఫ్ పీడీ విజయకుమారి, వ్యవసాయ శాఖ డిడి మాధవీలత, వ్యవసాయ అధికారులు ఏడిఏ ఎ.రత్నశ్రీ, ఏవివి అనితభాను, బి వెంకటేశ్వరరావు, (మిగతా 6లో)



కండ్రికలో..

పెనుగంచిప్రోలును కరువు మండలంగా ప్రకటించాలని తీర్మానం

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పెనుగంచిప్రోలు మండలాన్ని కరువు మండలంగా సభ్యులు తీర్మానం చేశారు. ఎంపిపి గాంధీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల్లోని సమస్యలపై సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు నాగమణి, ఎంపీపీ గాంధీ మాట్లాడుతూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి కళ్యాణి ఎంపీడీవో సిధారెడ్డి పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: విశ్రాంత ఉపాధ్యాయులు, యుటిఎఫ్ జిల్లా పూర్వ కార్యదర్శి ఎస్.కె.అబ్దుల్ ఘనీ మాస్టారుని యుటి ఎఫ్ నాయకులు మంగళ వారం ఆయన స్వగృహంలో సత్కరించారు. యుటిఎఫ్ 50వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన స్వర్ణోత్సవానికి రాలేకపోయినందున ఆయనను ఇంటివద్దే కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట ప్రాంతంలో యుటిఎఫ్ సంఘ స్థాపనకు, సంఘ బలోపేతానికి ఘనీ మాస్టర్ చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ యన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు యం.కష్ణయ్య, జిల్లా కార్యదర్శి జె.సుధానంద్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన ఎంఇఒగా పుష్పలత

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి -1గా నియమితులైన చెరుకుమల్లి పుష్పలతకు మంగళవారం యుటిఎఫ్ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎండి జిలాని, ప్రధాన కార్యదర్శి నల్లపునేని సుబ్రహ్మణ్య స్వామి జిల్లా కౌన్సిల్ సభ్యులు పాము నాగేశ్వరరావు దైద దానయ్య, రాష్ట్ర నాయకురాలు లీలా, సీనియర్ సభ్యులు షేక్ ప్రైమర్ పాల్గొన్నారు.

షేక్ రాజా ఆసుపత్రిలో షెడ్డు నిర్మాణం



రమేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ నియోజక వర్గ పరిధి లోని షేక్ రాజా సాహెబ్ ప్రసూతి (మినీ జనరల్) ఆసు పత్రిలో రోగుల సౌక ర్యం కోసం రూ 1.50 లక్షల వ్యయంతో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టిన నగరంలోని ప్రముఖ మీనాక్షి కాన్స్ట్రక్షన్ అధినేత పెద్ది రమేష్‌ని మంగళవారం ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసి యేషన్ (ఏపిఎమ్‌పిఏ) నాయకులు కేఎల్ రావు నగర్‌లోని రమేష్ కార్యాలయంలో రమేష్‌కి చిరు సత్కారం చేశారు. రాజా సాహెబ్ ఆసుపత్రిలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించింది. దానిలో భాగంగా ఆధునిక సాంకేతిక వైద్య పరికరాలు ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవటానికి వచ్చేవారు మందుల కోసం ఏండలో, వానలో నిలబడాల్సి రావటంతో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యేమినేని వెంకట రమణ, బిల్డర్ పెద్ది రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన మానవీయ కోణంలో స్పందించి ఆసుపత్రిలో తన సొంత ఖర్చుతో షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపిఎమ్‌పిఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇష్కా రాజేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి యేమినేని వెంకట రమణ, విజయవాడ నగర అధ్యక్షులు తాళ్లూరు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాసరావు, అంతిమ తీర్పు జాతీయ దినపత్రిక ఎడిటర్ వి. ప్రసాద్ పాల్గొన్నారు.

దళిత యువకుడికి ఎంఎల్‌సి పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న ఎంఎల్‌సి

ప్రజాశక్తి - కంచికచర్ల : విజయవాడలోని ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కంచికచర్ల దళిత యువకుడు కాండ్రు శ్యాంకుమార్ పూర్తిగా కోలుకునేంత వరకు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందని ఎంఎల్‌సి డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ అన్నారు. ఇటీవల ప్రకాశం జిల్లాకు చెందిన ఐగురు యువకులు కంచికచర్లకు చెందిన దళిత యువకుడు కాండ్రు శ్యామ్‌ను కిడ్నాప్ చేసి దారుణంగా హింసించిన విషయం తెలిసిందే. అనంతరం వైద్యులతో మాట్లాడి శ్యాం కుమార్‌కు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి



ప్రజాశక్తి -ఎడ్యుకేషన్ : ఎన్‌టిఆర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుకకు మంగళవారం ఉదయం వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య మాట్లాడుతూ విస్సన్నపేట మండలంలో పలు పాఠశాలల్లో టీచర్లను విజయవాడ కార్పొరేషన్‌కు సర్దుబాటు ద్వారా పంపారన్నారు. దీని వలన విస్సన్నపేట మండలంలోని తెల్లదేవరపల్లి, విస్సన్నపేట 3, 4 వార్డు, నాయకుల గూడెం, పుట్రేల పాఠశాలలో ఏకోపాధ్యాయ పాఠశాలలుగా కొనసాగుతున్నాయన్నారు. వీటిలో కొన్ని పాఠశాలల్లో నాడు నేడు ఫేజ్2 కూడా కొనసాగుతున్న దన్నారు. ఈపాఠశాలల్లో విద్యాబోధనకు ఆటంకం కలుగుతుందని వెంటనే పాఠశాలల్లో ఉపాధ్యాయులను కేటాయించాల్సిందిగా కోరారు. చైల్డ్ కేర్ లీవ్ మంజూరు విషయంలో జిల్లా వ్యాప్తంగా పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. డిఇవోను కలిసిన వారిలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యస్.పి. మనోహర్, జిల్లా కార్యదర్శి పి.భవాని, జిల్లా నాయకులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులున్నారు.

అధికారులతో ఎంఎల్‌ఎ సమీక్ష

ప్రజాశక్తి - నందిగామ : పొక్కునూరు – కాసర బాద గ్రామాల్లో "గడప గడపకు– మన ప్రభుత్వం" పూర్త వడంతో ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతి నిధులు, అధికారులతో నందిగామ ఎంఎల్‌ఎ డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజల దష్టికి తెచ్చిన సమస్యలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు జగనన్న ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తుందని ఎంఎల్‌ఎ పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు.

ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నందిగామ : క్యాట్ మొదటి దశ ఒలంపియాడ్ ఫలితాలలో నందిగామ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని పాఠశాల ప్రిన్సిపల్ ప్రదీప్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు భారత దేశ స్థాయిలో రెండో లెవెల్‌కు క్వాలిఫై అయ్యారని, క్వాలిఫైన విద్యార్థులను స్కూల్ ప్రాంగణంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇజిఎం మురళీకష్ణ, ఆర్ఐ వినోద్‌కుమార్, సిబ్యాచ్ ఇంచార్జ్ రామాం జనేయులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజాభిప్రాయసేకరణ

ప్రజాశక్తి - కంచికచర్ల : రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై సచివాలయం వారీగా ప్రజాభిప్రాయం సేకరించేందుకు ఈ నెల 9 నుండి ఆంధ్రాకు జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ అన్నారు. పరిటాల గ్రామంలో మంగళవారం రాష్టానికి. జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల సచివాలయాల కన్వీనర్ చింతా రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2.83 లక్షల కోట్ల లబ్దిదారుల ఖాతాల్లో వేశారన్నారు. నవరత్నాలు పేరుతో అందజేసిన పథకాలను బుక్ లెట్ రూపంలో అందజేసి, ప్రభుత్వం పనితీరుపై ప్రజాభిప్రాయం సేకరించాలన్నారు.

27, 28 తేదీల్లో 'కర్షక మహా పడావ్'



మాట్లాడుతున్న కమల

ప్రజాశక్తి - నందిగామ : 27,28న విజయ వాడలో జరిగే కార్మిక, కర్షక మహా పడావ్ లకు ఆశా వర్కర్స్ తరలి రావాలని ఆశా వర్కర్ల ఎన్టీఆర్ జిల్లా యూనియన్ (సిఐటియు) కార్యదర్శి ఎ.కమల పిలుపునిచ్చారు. మంగళవారం నందిగామ సుందరయ్య భవనంలో నందిగామ మండల ఆశా వర్కర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆశావర్కర్ల ఎన్టీఆర్ జిల్లా యూనియన్ (సిఐటియు) కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్, నందిగామ ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు వనజ, దుర్గ పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సిని కలిసిన ట్రాన్స్‌కో ఎస్ఇ

ప్రజాశక్తి - నందిగామ : ఎపిఎస్పిడిసిఎల్ ఎన్టీఆర్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇంజనీర్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సత్యానంద్ నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్‌లను మంగళ వారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్ఇగా బాధ్యతలు స్వీకరించిన సత్యా నందకి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు శుభాకాం క్షలు తెలిపారు. అనంతరం నందిగామ నియోజకవర్గంలోని పలు మండలాల్లో అవసరమైన సబ్‌స్టేషన్ల ఏర్పాటు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్తు లైన్ల ఏర్పాటుకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

బాధితురాలి కుటుంబానికి న్యాయం చేస్తా

తిరువూరు : తిరువూరు మండలంలోని ముస్టికుంట్లలో కొంతమంది కామాంధుల చేతిలో చితికిపోయిన మతి స్థిమితంలేని మహిళ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని వైసిపి నాయకుడు బరిగల కోటేష్ పేర్కొన్నారు. స్థానిక దారా పూర్ణయ్య టౌన్‌షిప్‌లో తన నివాసంలో మాట్లాడుతూ బాధితు రాలికి ఇల్లు మంజూరు చేయించి, ఆమె తమ్ముడికి అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని కోటేష్ హామీ యిచ్చారు.

రైతులను గాలికొదిలేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని పత్తి, మిర్చి, వరి తదితర పంటలు సాగుచేసిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని విత్తనం దగ్గర నుంచి ఎరువులు, మందులు, నాట్లు, కలుపులు తీసి వరికి రూ.40వేలు పత్తికి, రూ.50 వేలు మిర్చికి లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టి చివరకు సాగునీరు అందక నానా ఇబ్బందులు పడుతున్న రైతులను ఈ ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని టిడిపి నాయకులు వాపోయారు. ఎండిపోయిన పంటలను మంగళవారం జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ రైతు సంఘం నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులతో పరిశీలించారు. మంగళవారం మండలంలో రెడ్డినాయక్ తండ, అన్నవరం గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. **నందిగామ :** నందిగామ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో నీరు లేక పంటలు ఎండిపోయిన పొలాలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మంగళవారం పరిశీలించారు. తీవ్ర వర్షాభావం వల్ల వానలు లేక నందిగామ నియోజకవర్గంలో మున్నేరు నది వైరా నది పరివాహక ప్రాంతంలో నీరందక దెబ్బతిన్న ఎండిపోయిన వరి, పత్తి , మినుము, పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

రేపటి నుండి 'పల్లెకు పోదాం'

ప్రజాశక్తి - గంపలగూడెం : ఈ నెల తొమ్మిది నుండి 23 వరకు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గంపల గూడెం ఎంపిడిఒ టివిఎస్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అందరి ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9న అనుములంక నుండి ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. పదో తేదీ కనుమూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాణాసంచా షాపులకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ అధికారి పి.సాయిబాబు దీపావళి షాపుల వ్యాపారులతో సమీక్ష నిర్వహించారు. దీపావళి సందర్భంగా వ్యాపారులు లైసెన్స్ తీసుకోవాలని కోరారు. షాపుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నందిగామ ఎసిపి జనార్ధన్ నాయుడు, నందిగామ తహశీల్దార్లు నరసింహారావు, మున్సిపల్ కమీషనర్ జయరాం, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్, ఫైర్ డిపార్ట్మెంట్, మెడికల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **వత్సవాయి:** బాణసంచా షాపులు పెట్టదలచిన వారు తప్పనిసరిగా అనుమతులు తీస్కోవాలని వత్సవాయి ఎస్ఐ అభిమన్య తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా మందు గుండు సామాను బాణాసంచా ఎవరివద్దనైనా ఉంచుకున్నా, అమ్మదలుచుకున్నా తయారు చేయాలనుకున్నా.. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

'సంబరం'లో దుర్గగుడి చైర్మన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానంలోని షాపులు నిర్వహించే వ్యాపారులు అమ్మవారి సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో షాపుల నిర్వాహకుల వారి ఆహ్వానం మేరకు దుర్గా ఘాట్ వద్ద షాపుల వారి సంబరం కార్యక్రమం లో మంగళవారం ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కర్ణాటి రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబును షాపుల నిర్వాహకులు స్వాగతించి సన్మానించారు. అనంతరం పూజాదికాలు నిర్వహించి, సంబరంలో పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న రైతులు

రెడ్డిగూడెంను కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మంగళవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎం.పాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మాధవరెడ్డి మాట్లాడుతూ మండలంలో వరి పంట వేసిన విస్తీర్ణంలో 60 శాతం పైరు ఎండిపోయిందని, 40శాతం పైరును పండించుకునేందుకు రైతాంగం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, మినుము కూడా దెబ్బతిందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో రెడ్డిగూడెం లేకపోవడం విచారకరమని ప్రభుత్వం స్పందించి రెడ్డిగూడెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటిం చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జంగా వెంకటరెడ్డి, రైతు సంఘం నాయకులు అప్పిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వాగు వద్ద కుంగిన బ్రిడ్జి

కుంగిన వాగు బ్రిడ్జి


ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం అడవిరావులపాడు గ్రామం వద్ద నందిగామ–రామన్నపేట రహదారిపై నల్లవాగుపై నిర్మించిన బ్రిడ్జి కుంగింది. రెండు అడుగుల లోతు గొయ్యి పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. నందిగామ ఆర్అండ్‌బి ఎఇ నరేంద్ర స్పందించి పరిశీలించారు. తాత్కాలికంగా గొయ్యి పూడ్చి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తామని తెలిపారు. నందిగామ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆకుల హనుమంతరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రూ.20 స్టాంపును రద్దుచేయాలి

ప్రజాశక్తి - తిరువూరు : రూ.20 వెల్ఫేర్ స్టాంపును రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఇచ్చిన పిలపుమేరకు తిరువూరు కోర్టు న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులు బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి అంకిరెడ్డి అంజనా రెడ్డి, న్యాయవాదులు మోదుగుమూడి శ్రీనివాస రావు, రాజవరపు శ్రీనివాసరావు, పాల్గొన్నారు.


మొవ్వలో...


ఘంటసాలలో..


గొడవర్రులో...

'ప్రజా రక్షణభేరి'పై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-మొవ్వ

లౌకికతత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి, రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న విజయవాడలో తలపెట్టిన ప్రజారక్షణ భేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం నిర్వహించిన బైక్ ర్యాలీకి ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. మండల పరిధిలోని నిడుమోలులో ర్యాలీని సిపిఎం జిల్లా నాయకులు చౌటపల్లి రవి ప్రారంభించగా మంత్రిపాలెం, అవిరిపూడి, చినముత్తేవి, అయ్యంకి, పెడసనగల్లు, భట్లపెనుమర్రు, కూచిపూడి, మొవ్వ, మొవ్వపాలెం, వేములమడ మీదుగా కోసూరు వరకు కొనసాగింది. గ్రామాల ప్రధాన కూడళ్లలో నేతలు ప్రసంగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తూర్పారబట్టారు. ప్రచారభేరితో ప్రజాసమస్యలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఏకరువు పెడుతూ ప్రజాక్షేత్రంలోకి వచ్చిన సిపిఎం ప్రచారభేరీకి గ్రామగ్రామాన ప్రజల నుండి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శీలం నారాయణరావు, మద్దుల బసవయ్య, వాకా రామచంద్రరావు, ఉప్పుల వెంకటాద్రి, పామర్తి శ్రీను, డొక్కు వడ్డికాసులు, బత్తెన రామచంద్రరావు, దగాని రాయప్ప, కొడాలి కరుణాకరరావు, రావులపాడు మురహరిరెడ్డి, కాకి రాజశేఖర్, ఏనుగు శ్రీనివాసరావు, జొన్నలగడ్డ వాసు, కాకుల తిరుపతి వెంకటేశ్వరరావు, మునిబోయిన కనకచింతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల: ఈ నెల 15న విజయవాడలో నిర్వహిస్తున్న ప్రజా రక్షణభేరిని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం శ్రీకాకుళం, ఘంటసాలపాలెం, ఘంటసాలలోని పిహెచ్సి వద్ద ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా మాట్లాడుతూ ప్రభుత్వం ఆశ వర్కర్ల పట్ల కర్కశంగా ప్రవర్తిస్తుందన్నారు. ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదన్నారు. **కంకిపాడు:** గొడవర్రు గ్రామంలో గోడపత్రికలను విడుదల చేశారు. కౌలురైతులు, రైతులు, డప్పు కళాకారులు, చర్మకారులు సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర

ప్రజాశక్తి - గన్నవరం : అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో అక్టోబర్ 30వ తేదీన పార్వతీపురం జిల్లా సీతంపేటలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో బయలుదేరిన ప్రజారక్షణ భేరి రాష్ట్రస్థాయి బస్సు యాత్ర బుధవారం కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు నుంచి బయలుదేరి ఉదయం 7:30 గంటలకు హనుమాన్ జంక్షన్ వద్ద కృష్ణాజిల్లాలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుంచి పార్టీ శ్రేణులు వేలాదిగా హాజరై యాత్రకు స్వాగతం పలుకుతారని తెలిపారు. 9 గంటలకు హనుమాన్ జంక్షన్ సెంటర్లో సభ జరుగుతుందని తెలిపారు. అనంతరం వందలాది బైకులతో ర్యాలీగా వీరవల్లి, ఉంగుటూరు మండలం తేలప్రోలు, గారపాడు, పొణుకుమాడు గ్రామాల మీదుగా ఉంగుటూరు చేరుతుందని తెలిపారు. 11 గంటలకు ఉంగుటూరు సెంటర్లో సభ ఉంటుందని పేర్కొన్నారు. ఆతర్వాత నాగవరప్పాడు, వెన్నూతల, దావాజీగూడెం మీదుగా గన్నవరం చేరుతుందని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు గన్నవరం ఎన్టీఆర్ బొమ్మ సెంటర్లో సభ జరుగుతుందన్నారు. అనంతరం గూడవల్లి వద్ద ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. ఈ బస్సు యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.సుబ్బ రావమ్మ, వి.వెంకటేశ్వర్లు మాట్లాడతారని చెప్పారు.

నేడు గ్రామసభలు

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామసభలు బుధవారం మానికొండ, నందమూరి, తరిగొప్పల, వేంపాడు గ్రామాలలో జరుగుతాయని ఈ సభలలో 2024 25 సంవత్సరమునకు గాను ఉపాధి ప్రణాళిక మరియు పనులు గుర్తించడం జరుగుతుంది అని ఎంపిడిఓ శేషగిరిరావు అన్నారు, ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు.

సబ్సిడీని రైతులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు వినియోగించుకొని అధిక లాభాలు పొందాలని ఉద్యానవన శాఖ అధికారి ఎం రమేష్ బాబు రైతులకు సూచించారు. మంగళవారం అవనిగడ్డ తొమ్మిదవ వార్డులో ని రైతు భరోసా కేంద్రంలో రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న పథకాలను వివరించారు. పామాయిల్ తోటలు పెంచుకునేందుకు కొబ్బరి జామ అరటి బొప్పాయి తోటలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులకు వివరించారు రైతులు (ఎఫ్ ఐ జి) ఫార్మర్ ఇంట్రెస్ట్ గ్రూపుగా ఏర్పడి అనేక రాయితీలు ప్రోత్సాహక పథకాలు పొందవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు ఎ.జీవిత, జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ సభ్యులు సామర్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలోని పెద్ద అవుటపల్లి సుగాలిపేటలో గత మూడు మాసాలుగా ఆత్కూరు వైపు నుండి కోళ్ల ఫారం, రిచ్, అమ్మ గార్ల ఆశ్రమంలో నుండి వస్తున్నటువంటి మురుగు వల్ల అనారోగ్యాలకు గురి అవుతున్నా పట్టించుకోవడం లేదు అనే అర్జీపై స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఎంపీడీవో తాసిల్దార్ పంచాయతీ కార్యదర్శి క్షేత్రస్థాయిలో పరిశీలించి మురుగునీరు డ్రైనేజీని జెసిబి ద్వారా బాగు చేయించారు అని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'రోడ్డు ప్రమాదాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి'

ప్రజాశక్తి-అవనిగడ్డ: రోడ్డు ప్రమాదాలు జరగడానికి రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందని దీనితో ఇటీవల అవనిగడ్డ ప్రైవేట్ పాఠశాల బస్సు విశ్వనాథపల్లి సమీపంలో కాలవలోకి దూసుకుపోవడమే నిదర్శనమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చౌటపల్లి రవి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడూరు అవనిగడ్డ రహదారి కొత్తపాలెం రహదారి తీవ్రంగా దెబ్బతిన్నాయని అయినప్పటికీ ముఖ్యమంత్రి సభ ముఖంగా ఇచ్చిన హామీని ఇప్పటివరకు నెరవేర్చకపోవడమే రోడ్డు ప్రమాదాలకు కారణమన్నారు. ఇటీవల మాచవరం వద్ద ఒక కారు కాలువలోకి దోచుకుపోగా కాలువలో నీళ్లు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అదేవిధంగా తాజాగా విశ్వనాథపల్లి కొత్తపాలెం మధ్య స్కూల్ బస్సు కాలువలో దూసుకుపోయిన సంఘటనలో కాలువలో నీళ్లు లేకపోవడమే ప్రమాదం జరగకపోవడానికి కారణం అన్నారు. బస్సులో 14 మంది విద్యార్థులు ఉండగా చిన్న గాయాలతోనే వారు బయటపడటంతో స్కూల్ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారన్నారు కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ఎంత ప్రమాదం జరిగి ఉండేదో ఆలోచించుకోవాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రహదారులను బాగు చేయాలని కోరారు.

సంకల్పంతో ఏదైనా సాధ్యమే : నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అవనిగడ్డ: విద్యార్థులు సంకల్పంతో శ్రమ పడితే ఏదైనా సాధించవచ్చునని ప్రముఖ మోటివేటర్ ఏ నాగేశ్వరరావు సూచించారు ఎస్ వి ఎల్ క్రాంతి కళాశాలలో ఇంటర్ డిగ్రీ విద్యార్థులకు మంగళవారం మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక బద్ధంగా విద్యనభ్యసించాలని ఎందుకు మనోధైర్యం ఎంతో అవసరం అన్నారు తాను సాధించగలనని పాజిటివ్ ఆలోచనతో ప్రారంభం అవ్వాలని ఎంతటి కష్టాన్నైనా అధిగమించగలనని పట్టుదల ఆత్మవిశ్వాసం పెంపొందించుకోగలిగితే కచ్చితంగా విజయం తమ చెంత చేరుతుందని సూచించారు. విద్యార్థులు ఆలోచనలను అదుపులో ఉంచుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు విద్యార్థులు తాము ఏ లక్ష్యాన్ని అయితే సాధించ దలిచా రో ఆ లక్ష్యాన్ని చేదించేందుకు పట్టుదల కష్టి అవసరమని నాగేశ్వరరావు ప్రబోధించారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు అధ్యాపకులు పాల్గొన్నారు.



అప్పికట్లకు పరామర్శ

ప్రజాశక్తి-కోడూరు: కోడూరు మండలం మాచవరం గ్రామం తెలుగుదేశం పార్టీ నాయకులు అప్పికట్ల పెద్ద తాతయ్యని కృష్ణాజిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ కోడూరు మండలం టిడిపి నాయకులతో కలిసి మంగళవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో పెద్ద తాతయ్య సోదరుడు అప్పికట్ల రామకృష్ణ మతిచెందగా ఆయన నివాసానికి వెళ్లి మతికి గల కారణాలను తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కూరాకుల ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కూరాకుల శివయ్య, రేపల్లె ప్రతాప్, అప్పికట్ల రామాంజనేయులు, పిరాటి నాగబాబు తదితరులు ఉన్నారు.

విద్యుత్ వాడకంపై తనిఖీలు

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి మండలంలో విద్యుత్ వినియోగదారులు గృహాలు, వాణిజ్య సముదాయాల విద్యుత్ వాడకంపై విజిలెన్సు అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ దాడులలో 217 మంది వినియోగదారులపై వివిధ కేసుల కింద రూ.5.24 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు మోపిదేవి విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ పాండురంగారావు తెలియజేశారు. విజిలెన్స్ యస్.ఈ ఆల్ఫాన్స్ ఆధ్వర్యంలో అధికారులు 37 బందాలుగా ఏర్పడి 1818 గృహ సర్వీసులు మరియు 57వాణిజ్య సముదాయాలు తనిఖీ చేశారు. వాటిలో 211 సర్వీసులకు అదనపులోడు గమనించి కేసులు నమోదు చేశారు.

గాంధీ కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-ఘంటసాల: గాంధీ బాబు కుటుంబ సభ్యులను పరామర్శించిన మండలి ఘంటసాల గ్రామానికి చెందిన టిడిపి అభిమాని పాతూరి గాంధీ బాబు ఇటీవల మతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ మంగళవారం గాంధీ బాబు కుటుంబ సభ్యులను, కుమారుడు వంశీ నీ పరామర్శించారు. గాంధీ బాబు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, తుమ్మల చౌదరి బాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, అయినపూడి భాను ప్రకాష్, వేమూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో మండలంలోని శేరీదగ్గుమిల్లి గ్రామంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని జన్ను శివకుమార్ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరరావు తెలిపారు. ఈ శిబిరంలో 108 గేదెలకు, 6 ఆవులు వైద్య పరీక్ష నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోలయన్ అడుసుమిల్లి రామ్మోహన్ రావు లయన్ వల్లభనేని సుబ్బారావు చౌదరి లయన్ పోలవరపు వెంకట్రావు లయన్ పొట్లూరు రవి గ లయన్ పి ఎన్ వి విజయ్ బాబు ట్రెజరర్ పెరుమాళ్ కార్యదర్శి చలసాని శ్రీధర్ పాల్గొన్నారు.

అదనపు సౌకర్యాలకు ఆమోదం

ప్రజాశక్తి-చల్లపల్లి: సిఎం జగన్ సహకారంతో చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి చేసినట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. చల్లపల్లిలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జ్ఞానరత్న ఆసుపత్రి అవసరాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన వైద్యులతో చర్చించి తీర్మానాలు చేశారు. సమావేశంలో అబ్దుల్ కరీం, వైద్యులు పాల్గొన్నారు.

200 మందికి అన్నదానం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం పారిశ్రామికవేత్త పర్వతనేని పాండురంగారావు అన్న ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేశారు. 200 మంది స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పాండు రంగారావును చైర్మెన్ నేరుసు భూషణం సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఇఒ కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సోషలిజంతోనే సమస్యలకు పరిష్కారం : సిపిఎం

ప్రజాశక్తి-గుడివాడ

మానవాళి సమస్యల విముక్తికి సోషలిజమే పరిష్కారమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి జ్యోతి అన్నారు. అక్టోబర్ విప్లవ దినోత్సవం సందర్భంగా మంగళవారం గుడివాడ సిపిఎం కార్యాలయంలో సిపిఎం సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి జెండా ఆవిష్కరించారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ అక్టోబర్ విప్లవ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు నవంబరు 7వ తేదీన జరుపుతాయని తెలిపారు. దోపిడీ సమాజంలో పేద, ధనిక తారతమ్యాలు నానాటికి ఎక్కువైపోతున్నాయన్నారు. కనీస అవసరాలైన విద్య, వైద్యం, ఉపాధి, నివాసం ఇలాంటి సమస్యలన్నీ సోషలిస్టు వ్యవస్థలోనే పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పవన్, నాయకులు బివి అరుణ, వి రజిని, ఆర్ కొండ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న మురళీకృష్ణారెడ్డి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

డిగ్రీ కోర్సులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వన్‌టౌన్ కొత్తపేటలో గల కాకరపర్తి భావ నారాయణ కళాశాలలో నూతనంగా ప్రవేశ పెట్టిన డిగ్రీ నాలుగో ఏడాది కోర్సులను విద్యార్థులు వినియో గించుకోవాలని ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టి నాలుగో సంవత్సరం డిగ్రీ కోర్సుకు సంబంధించి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీఎస్సీ (కెమిస్ట్రీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (స్టాటిస్టిక్స్), బీఎస్సీ (ఎలక్ట్రానిక్స్), బీఎస్సీ (డేటా సైన్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం (బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్), బీకాం (హెచ్ఆర్ అండ్ మార్కెటింగ్) కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. మరింత సమాచారం కోసం కళాశాల కార్యాలయంలో గానీ, ఫోన్ నెంబర్ 9182907747కు సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ కృష్ణవేణి పాల్గొన్నారు.


ఆర్‌డిఒను సన్మానిస్తున్న దృశ్యం

ఆర్‌డిఒకు సన్మానం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నూతన ఆర్‌డిఒగా పదవి బాధ్యతలు చేపట్టిన సాయిబాబును నంది గామ బార్ అసోసి యేషన్ సీనియర్ న్యాయవాది సీని యర్ సివిల్ జడ్జి కోర్టు పిపి నంద్రు శ్రీరామ్మూర్తి, హైకోర్టు న్యాయవాది ఎక్కిరాల హనుమంత రావు, వేల్పుల కోటేశ్వరావు మంగళవారం కలిసి సన్మానించారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కంచికచర్ల : గ్రీన్‌వే బ్రిక్స్ కంపెనీలో ప్రమాదవశాత్తు మృతి చెందిన పోలంకి హరికృష్ణ కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని బాధితులు కంపెనీ ఎదుట మంగళవారం రెండో రోజు ఆందోళన కొనసాగించారు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన పోలంకి హరికృష్ణ, స్థానిక గ్రీన్ వే బ్రిక్స్ కంపెనీలో పనిచేస్తూ 9 నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అప్పట్లో బాధితులతో పాటు టిడిపి, సిపిఎం, సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఆ సమయంలో పిఎఫ్, ఇఎస్ఐ, నష్టపరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిన ఇంతవరకూ ఇవ్వకపోవడంతో కుటుంబీకులు ఆందోళనకు దిగారు. సిపిఎం, సిఐటియు ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. తక్షణమే బాధితునికి పరిహారం అందించాలని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని ఒప్పందం అమలయ్యేలా చూడాలని కోరారు. ఈ ఆందోళనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, టిడిపి నాయకులు కోగంటి బాబు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - వత్సవాయి : పేద బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం రిపబ్లిక్ పార్టీ అండగా ఉంటుందని ఆంధ్రరాష్ట్ర ఎన్నికల కోఆర్డినేటర్ వల్లబిదాసు.తిరుపతిరావు అన్నారు. ఆయన చిట్యాల వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ రిపబ్లిక్ పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రకాష్ అంబేద్కర్ ఆధ్వర్యంలో పార్టీ అన్ని రాష్ట్రాల్లో విస్తరింపజేసేందుకు తగు కృషి చేస్తున్నట్టు చెప్పారు. 2024లో ఆంధ్రరాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయటానికి అడుగులు ముందుకు వేస్తున్నట్లు చెప్పారు.

రష్యావిప్లవంతో వలస దేశాలకు విముక్తి

పలుచోట్ల పతాకావిష్కరణలు
ప్రజా రక్షణ భేరి ప్రచారం

విజయవాడ : రష్యన్ విప్లవ దినోత్సవం సందర్భంగా నగరంలోని కాట్రగడ్డ శ్రీనివాసరావు భవన్ వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంగళవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ విప్లవ పోరాటం సామ్రాజ్య వాద దోపిడీని ఎదిరించడంతో పాటు, వలస దేశాలకు విముక్తిని సాధించిందన్నారు. పాలస్తీనాపై జరుగుతున్న దాడి చూస్తే ఎంత మోసపూరితమో అర్థమవుతోందన్నారు. దేశ సంపదను పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు బిజెపి పూనుకుందన్నారు. ప్రజలపై వివిధ భారాలు మోపుతుందన్నారు. ఇలాంటి ప్రజా సమస్యల పరిష్కారానికి అసమానతలు లేని అభివృద్ధికి సిపిఎం ప్రజా రక్షణ భేరి 15న తలపెట్టిందని ఆయన తెలిపారు. ప్రజలంతా దీనికి మద్దతివ్వాలని కోరారు. 61వ డివిజన్‌లో బాబూరావు పాల్గొని 15న ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయాలని కోరారు. సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పిఎన్ బస్‌స్టేషన్ వద్ద సిఐటియు జెండాను వెంకటేశ్వరరావు, సిపిఎం జెండాను యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాద్ ఆవిష్కరించారు. అనంతరం ఆటో కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ... కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15న సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగే ప్రజారక్షణ భేరి సభలో ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 58, 59వ డివిజన్‌లలోని లెనిన్ సెంటర్‌లో రష్యా విప్లవం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి ఎస్‌కె నిజాముద్దీన్, సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, పార్టీ బాధ్యులు మూర్తి, నాగార్జున, మురారి హాజరయ్యారు. **చందర్లపాడు :** మండల కేంద్రమైన చందర్లపాడులోని స్థానిక బస్టాండ్ సెంటర్లో ఈ నెల 15వ తేదీన విజయవాడలో జరుగుతున్న సిపిఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ గోడపత్రికల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చనుమోలు సైదులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చందర్లపాడు శాఖ కార్యదర్శి షేక్ హస్సాన్, సిపిఎం నాయకులు వేల్పుల ఏసోబు పాల్గొన్నారు. **వత్సవాయి :** వత్సవాయి మండలంలో వివిధ గ్రామాలలో ప్రచార జాత కార్యక్రమం నిర్వహించారు. మండల కమిటీ సభ్యులు రాయల సుదర్శనం పార్టీ జెండా ఊపి జాతా ప్రారంభించగా సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమ్మినేని రాంబాబు, మండల కమిటీ సభ్యులు కంచర్ల కొండయ్య పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో మంగళవారం ప్రజారక్షణభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. బహిరంగ సభకు అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జుజ్జువరపు వెంకటరావు పాల్గొన్నారు. **కంచికచర్ల :** ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కంచికచర్లలో మార్కెటింగ్ యార్డు పిహెచ్‌సి ఆశా, ఆటో, రిక్షా, అంగన్వాడీ ఇతర రంగాల్లో గ్రూపు మీటింగులు నిర్వహించి ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు **నందిగామ :** నందిగామలో 18వ వార్డులో నవంబర్ 15 సిపిఎం ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయాలని మంగళవారం ప్రచార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నందిగామ కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ ప్రమాదంలో పడిన మన రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత సామాన్య ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సయ్యద్ ఖాసిం, తదితరులు పాల్గొన్నారు. **వీరులపాడు:** ప్రజారక్షణ భేరి బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను అల్లూరులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కె.కళ్యాణ్, కమిటీ సభ్యులు గుంజి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** సోవియట్ రష్యా విప్లవం 1917లో జయప్రదమైన కార్మిక వర్గ రాజ్య స్థాపన వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సిపిఎం స్థూపం వద్ద జెండా ఆవిష్కరించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొండపల్లి స్టేషన్ సెంటర్ కొల్లి ఆదినారాయణ వీధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపియం సీనియర్ నాయకులు ఎ.విఠల్ రావు, మాజీ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వరరావు జెండా ఆవిష్కరించగా కొండపల్లి టౌన్ కమిటీ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడారు.


విజయవాడలో...


విజయవాడ పిఎన్ బస్టాండ్ వద్ద


జగ్గయ్యపేటలో...


నందిగామలో...


వీరులపాడులో...


విజయవాడలోని 58వ డివిజన్‌లో...


చందర్లపాడులో...


కంచికచర్లలో...


ఇబ్రహీంపట్నంలో

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, పశ్చిమ నియోకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పశ్చిమ నియోజకవర్గంలోని 35,41,48,51,56 డివిజన్లలోని ఐదు సచివాలయలలో పరిదిలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు సందర్శించి, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన బాగ్యలక్ష్మి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బాలసాని మణెమ్మ, కార్పొరేటర్లు ఎం.డి. ఇర్ఫాన్, అత్తలూరి అదిలక్ష్మి, మరుపిళ్ల రాజేష్. యలకల చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.


కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్


నివాళులర్పిస్తున్న దృశ్యం

సి.వి.రామన్‌కు నివాళి

ప్రజాశక్తి- తిరువూరు : ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సివి.రామన్ అతి తక్కువ ఖర్చుతో ప్రయోగాలు చేసి రామన్ ఎఫెక్ట్ కనుగొని నోబెల్ బహుమతి పొందారని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వి.సాయిరాం అన్నారు. మండలంలోని గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం సివి.రామన్ జయంతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు. రామన్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను విద్యార్థులు చదవాలన్నారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయురాలు జి.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు ఎస్.వి.బి. రాజేంద్రప్రసాద్, ఎ.వెంకటేశ్వర్లు, జె.వివి ప్రతినిధులు డి.సుదర్శన్, ఎం.రాం ప్రదీప్ పాల్గొన్నారు.

ఎన్‌టిటిపిఎస్‌లో వరల్డ్ ఆక్యుపంక్చర్ దినోత్సవం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: వరల్డ్ ఆక్యుపంచర్ దినోత్సవం సందర్భంగా డాక్టర్ నార్లతాతారావ్ తాపవిద్యుత్ కేంద్రంలో సర్వీస్ బిల్డింగ్‌లో సెమినార్, వైద్య శిబిరంను ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ అఫ్ భారత, విజయవాడ వారి సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ ఇంజనీర్ జెడ్.ఎమ్ పి.నవీన్ గౌతమ్, ఆక్యుపంచర్ సైన్స్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ అఫ్ భారత, విజయవాడ ఫౌండర్, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.సత్యనారాయణ హాజరై మాట్లాడారు. ఆక్యుపంచర్ అనే వైద్య విధానం అతిపురాతనమైనది, ఇది మన భారత జాతికి సంబంధించినది, కానీ చైనాలో పేరు పొందిందన్నారు. ఈ వైద్య విధానంలో ఎటువంటి దుష్ ప్రభావాలు, హాని ఉండవని, దీని చికిత్సకు ఎటువంటి ఖర్చు ఉండదన్నారు. ఈ విధానంలో కొన్ని చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకొంటే ఎటువంటి జబ్బులు దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీర్ పరిపాలనా విభాగం కె.వి.రాజారావు, పర్యవేక్షక ఇంజనీర్ సివిల్ విభాగం, కష్ణారావు, పర్యవేక్షక ఇంజనీర్ పర్యావరణం సురేష్ బాబు, డిప్యూటీ సెక్రటరీ, ఎం.సుశీల, తదితరులు పాల్గొన్నారు.


వైద్యవిధానాన్ని చూపిస్తున్న దృశ్యం

వసతి గృహాల్లో వసతుల కల్పనకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

వసతి గహాల్లోని విద్యార్థుల హక్కులకు ఎలాంటి భంగం కలిగినా, అవాంఛనీయ సంఘటనలు జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలకు వెనుకాడబోమని జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు సంబంధిత అధికారులను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో ఆయన జిల్లాలోని సంక్షేమ వసతి గహాల్లో మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ, బీసీ, ట్రైబల్, ఏపీ రెసిడెన్షియల్ వసతి గహాల్లో విద్య, సంక్షేమం, పౌష్టికాహారంపై అధికారులు ప్రత్యేక దష్టి పెట్టి పేద విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు వారి పరిధిలోని వసతి గృహాలను తరచుగా సందర్శించాలని, విద్యార్థులు పడుకునే గదులు, ఫ్యాన్ల పనితీరు, నీటి వసతి, భవనంలో వర్షపు నీరు లీకేజీలు, శ్లాబ్ పరిస్థితులతో పాటు మరుగుదొడ్లు, పరిశుభ్రతపై పర్యవేక్షించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ, ఇన్చార్జి బీసీ వెల్ఫేర్ డీడీ షేక్ సాహిద్ బాబు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణీ ధూర్జటి, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డీసీఓ సుమిత్రాదేవి పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎంపి, కలెక్టర్

'వై ఎపి నీడ్స్ జగన్'కు సిద్ధం కావాలి

కృష్ణాజిల్లాలో ఈ నెల 9వ తేదీ నుండి 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహణకు సిద్ధం కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులతో కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి వాలంటీర్ పరిధిలో గల అన్ని గృహాలు సందర్శించి వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల కింద వారు పొందిన లబ్ధి వివరించాలని తెలిపారు.

పిల్లలకు అండగా ఉంటాం : ఎంపి

కష్టపడి చదివితే రానున్న జీవితంలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ప్రభుత్వం మీకు ఎప్పుడూ తోడుగా ఉంటుందని ఎంపి వల్లభనేని బాలశౌరి, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు చిన్నారులను దీవించారు. మంగళవారం మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పెడన నియోజకవర్గం వీరభద్రాపురం గ్రామానికి చెందిన జక్కుల ఉషశ్రీ, జక్కుల జుహితేశ్వరి తల్లిదండ్రులు కోవిడ్ విపత్తులో ప్రాణాలు కోల్పోవడంతో అనాథులుగా మిగిలిపోయారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ కోవిడ్ సమయంలో తల్లితండ్రులను కోల్పోయిన పిల్లలకు ఉచితంగానే విద్యను అందించాలంటూ సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టిందన్నారు. కోవిడ్ కారణంగా తల్లిదండ్రులు, ఎవరో ఒకర్ని కోల్పోయిన వారి వివరాలను చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.



నేటి నుంచి ఉచితంగా మంచినీరు

ప్రజాశక్తి-గన్నవరం: వెంకట నరసింహపురం రోడ్డులో ఉన్న అయోధ్య గేటెడ్ కమ్యూనిటీ భవన సముదాయం వద్ద బుధవారం నుంచి ఉచిత మంచినీటి పథకం ప్రారంభిస్తున్నట్లు డైరెక్టర్ గుర్రం నాని తెలిపారు. పేద ప్రజలు, రైతుల సౌకర్యార్థం ఈ స్కీమును అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 9.30 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుండి రెండు గంటల వరకు, సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు మంచినీరు పంపిణీ జరుగుతుందని వివరించారు. గన్నవరం, వెంకట నరసింహపురం, పురుషోత్తపట్నం, బీబీ గూడెం గ్రామాల్లోని ప్రజలు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

విద్యుద్ఘాతంతో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

విద్యుద్ఘాతంతో మహిళా రైతు, వ్యవసాయ కార్మికుడు మృతిచెందిన సంఘటన సోమవారం పాములలంకలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పాములలంక గ్రామానికి చెందిన రైతు పాముల విజయాంబ (58) వ్యవసాయ కార్మికుడు పాముల చిరంజీవి (38)తో కలిసి పసుపు చేనుకు ఎరువు చల్లడానికి వెళ్లారు. పొలం పక్కనే ఉన్న ఎర్ర చందనం తోట చుట్టూ ఫెన్సింగ్ వేశారు. ఫెన్సింగ్ మీద నుండి కరెంటు మోటారుకు చెందిన విద్యుత్ వైరు జారి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయింది. ఈ క్రమంలో పొలం దగ్గర తేమగా ఉండటంతో విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు.



పొలం వెళ్లిన వారు ఎంతసేపటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకగా పొలంలో ఇద్దరూ విగత జీవులుగా పడి ఉన్నారు. తోట్లవల్లూరు ఎస్సై విశ్వనాధ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డొంక రోడ్డును బాగు చేయాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: అంగలూరు గ్రామంలో చేరువుపల్లి డొంక రోడ్డును బాగు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం రోడ్డును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ 300 మంది వరకు రైతులు 700 ఎకరాల్లో మూడు కిలోమీటర్ల పరిధిలోని ఈ డొంక ద్వారా వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ సెక్రటరీ పోస్టు ఖాళీగా ఉందని, సూపర్‌వైజర్‌ను ఇన్‌ఛార్జిగా పెట్టి కాలక్షేపం చేస్తున్నారన్నారు. వరి కోతల నాటికి రోడ్డుకు మరమ్మతులు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలురైతుల సంఘం జిల్లా నాయకులు బి.వి.శ్రీనివాసరావు, మండల గౌరవాధ్యక్షులు మామిడి బాబురావు, గ్రామ కార్యదర్శి చిలుముల కృష్ణ, మామిడి నాగబాబు, పంగా సంజీవ్, చిలుముల రాము, మామిడి నాగబాబు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు అక్రమంగా నిల్వ ఉంచిన, విక్రయించిన వారిపై చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ పి.జాషువా హెచ్చరించారు. కొంతమంది ఎటువంటి ప్రభుత్వ, పోలీసు వారి అనుమతి లేకుండా అనధికారికంగా ముడి సరుకులు తీసుకువచ్చి చాటుమాటున అమ్ముకొని లాభార్జన చేసుకుంటున్నారని, ఇలా అక్రమంగా మందు గుండు సామాగ్రి నిల్వ ఉంచిన, రవాణా చేసిన, తయారు చేసిన వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి ప్రత్యేక దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. బాణసంచా తయారీ, నిల్వలు, విక్రయాలు నిర్వహించేందుకు పోలీసువారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్నప్పటికీ ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా జనావాసాల మధ్యలో గోడౌన్స్ ఏర్పాటు చేసి ప్రజా భద్రతను, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. బాణసంచా విక్రయ లైసెన్స్ కల్గిన దుకాణదారులు మాత్రమే అమ్మాలన్నారు. **చల్లపల్లి:** అనుమతి లేకుండా దీపావళి టపాసులు నిల్వ చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చల్లపల్లి సిఐ సీహెచ్.నాగప్రసాద్ అన్నారు. చల్లపల్లిలోని బాణాసంచా దుకాణాన్ని రెవెన్యూ, పోలీస్, ఫైర్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీపావళి స్టాల్స్ ఏర్పాటు కోసం ఆటో నగర్ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి తహసీల్దార్ కే.గోపాలకృష్ణ, అవనిగడ్డ అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రసాద్, చల్లపల్లి, ఘంటసాల ఎస్ఐలు సీహెచ్.చినబాబు, కుడిపూడి శ్రీనివాసు పాల్గొన్నారు. **ఉయ్యూరు:** రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉయ్యూరు, పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వ మండలాల పరిధిలో బాణాసంచ విక్రయించే వారితో పాటు రెవిన్యూ, మున్సిఎల్, ఫైర్ విద్యుత్ శాఖ అధికారులతో ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు సమావేశం నిర్వహించారు. దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచ విక్రయాలకు సంబంధించి నిబంధనలు తప్పక పాటించాలని, షాపుల వద్ద తగు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. **గూడూరు:** సిఐ ఎండి హబిబ్ బాషా, ఎస్ఐ రవిచంద్రకుమార్ పెడన మండలంలో తనిఖీలు నిర్వహించారు. టపాసు విక్రయదారులు నిబంధనలు పాటించాలని కోరారు. **మొవ్వ:** కూచిపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు దుకాణాలను ఎస్ఐ డి.సందీప్ పరిశీలించారు. అనుమతి లేకుండా బాణాసంచా విక్రయాలు చేయకూడదన్నారు. **గుడ్లవల్లేరు:** గుడివాడ డిఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో సిఐ ఏసుబాబు గుడ్లవల్లేరు సెంటర్ నందు గల ఒక ఫ్యాన్సీ షాపులో తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేకుండా బాణాసంచాను ఉంచడంతో కేసు నమోదు చేశారు. **హనుమాన్‌జంక్షన్:** బాణసంచా సామగ్రి విక్రయించే వ్యాపారులుతో హనుమాన్ జంక్షన్ పోలీస్‌స్టేషన్లో సీఐ నవీన్ నరసింహమూర్తి సమావేశం నిర్వహించారు. దుకాణదారులు తప్పనిసరిగా అన్ని శాఖల అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సై జనార్ధన్, ఎఎస్ఐలు ఆంజనేయులు, పెద్దిరాజు పాల్గొన్నారు. **పమిడిముక్కల:** పమిడిముక్కల సిఐ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో షాపులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. **అవనిగడ్డ:** ఆవనిగడ్డలో పోలీస్ రెవెన్యూ అధికారులు టపాసులు అక్రమ నిలవ లు విక్రయాలపై మంగళవారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎల్‌విఎస్ రామకృష్ణ, ఎస్సై రమేష్, ఫైర్ ఆఫీసర్ ప్రసాద్ పాల్గొన్నారు.





అధికారులను కలిసిన ఉద్యోగ సంఘం నేతలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కృష్ణాజిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, మచిలీపట్నం రెవెన్యూ డివిజన్ అధికారి ఎం.వాణిలను ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా శాఖ అధ్యక్షులు పి.రాము ఆధ్వర్యంలో మంగళవారం వారి ఛాంబర్లలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తోట వరప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ బి సురేష్, జి శ్రీనివాసరావు, ఎం మహేష్, సాయిరాం నాయక్, బ్రహ్మానంద బాబు, పవన్ పాల్గొన్నారు.

మట్టిఖర్చులు అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన పోపుశెట్టి లంకేశ్వరరావు ఈ నెల 3వ తేదీన మరణించారు. ఆయన భార్య పోపుశెట్టి రజనీకి వైఎస్ఆర్ భీమా కింద మట్టి ఖర్చుల నిమిత్తం ఎంపీటీసీ సభ్యురాలు పెనుమాల పూర్ణ కవిత రూ.10 వేలు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏజెఎన్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.




350 మందికి వైద్యపరీక్షలు

పెనమలూరు: పెనమలూరు మండలంలోని పెదపులిపాక గ్రామంలో ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ గుంటూరు శ్రీనివాసచౌదరి శిబిరాన్ని ప్రారంభించారు. దాదాపు 350 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డా.బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నెల రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహిస్తామని,ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామాలయం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-గన్నవరం: మండలంలోని సూరంపల్లి గ్రామంలో ఉన్న సగర్లపేటలో నిర్మిస్తున్న భద్రాద్రి రామాలయ పనులకు గన్నవరం నియోజకవర్గ దస్తావేజు లేఖరుల సంఘం గౌరవాధ్యక్షుడు తోట వెంకయ్య రూ.లక్ష విరాళం మంగళవారం అందజేశారు. గ్రామంలో సగరుల సంఘం రామాలయం నిర్మించేందుకు సహాయం చేయాలని కోరగా ఆయన స్పందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులపాక బాబురావు, ఎంపీటీసీ సభ్యులు కొండ సీతారామయ్య, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



భవన నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి-చల్లపల్లి: మండల పరిధిలోని నడకుదురు గ్రామంలో మత్స్యకార సంఘ భవనం నిర్మాణానికి రూ.15 లక్షలు మచిలీపట్టణం ఎంపీ వల్లభనేని బాలశౌరి నిధులు మంజూరు చేసినట్లు సర్పంచ్ గురుపత్తి సురేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిని సర్పంచ్ సురేష్ బాబు, సొసైటీ అధ్యక్షులు వడుగు రామచంద్రరావు, కార్యదర్శి పీతా చిరంజీవి మచిలీపట్నంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ఆర్‌బికెలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరూ వినియోగించుకోవాలని సీడ్స్ అప్లై టెక్నికల్ అసిస్టెంట్ దివ్యభారతి అన్నారు. మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో 17 ధాన్యం కొనుగోలు కేంద్రాలు సెక్రెటరీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్‌తో సహా రైతులు కేంద్రానికి చేరుకుని ధాన్యాన్ని విక్రయించాలన్నారు.




సోషలిజమే పరిష్కారం : ఆర్.రఘు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి : ప్రపంచం, దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో పడిపోయిందని, ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి సోషలిజమే పరిష్కారమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు అన్నారు. సిపిఎం వైఎస్సార్ తాడిగడప నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపాల్టీ పరిధిలోని యనమలకుదురు లాకుల సెంటర్‌లో రష్యా విప్లవ దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కమిటీ కార్యదర్శి యు.త్రిమూర్తులు ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.రఘు మాట్లాడుతూ వర్గ ఉద్యమాలను, పోరాటాలను పెంచి సోషలిజం సాధనకు కృషి చేయాలన్నారు. తొలుత ఆయన సిపిఎం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు షేక్ మస్తాన్ వలి, ఐద్వా నాయకులు వలీమా, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీం పాల్గొన్నారు.



జాతీయ రహదారుల విస్తరణ పెండింగ్ పనులకు మోక్షం

ప్రజాశక్తి - నందిగామ, ఎ.కొండూరు : నందిగామ వద్ద విజయవాడ–హైదరాబాద్ 65వ నెంబర్ జాతీయ రహదారి, ఎ కొండూరు మండలం రామచంద్రపురం గ్రామం వద్ద 30వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు పున:ప్రారంభమయ్యాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి నిర్వహించిన సమీక్షతో పురోగతి వచ్చింది. సిఎస్ సూచన మేరకు ఆర్‌అండ్ బి సెక్రటరి పిఎస్ ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ నారాయణ పెండింగ్ విస్తరణ పనులు పూర్తిచేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 2017లో 65వ నెంబర్ విస్తరణ ప్రారంభమైంది. 2020లో పనులు పూర్తి చేసి రాకపోకలకు అనుమతించారు. అయితే హైవే బైపాస్ రోడ్డు వద్ద ఆరు వరుసల రోడ్డుగా అభివృద్ధిచేసిన జాతీయ రహదారి నందిగామ సమీపంలోని వై జంక్షన్ వద్ద సుమారు 880 మీటర్ల మేర భూసేకరణలో అడ్డంకులు ఏర్పడడంతో పనులు నిలిచిపోయాయి. గతంలో వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వెహికల్ అండర్' పాస్ వంతెన నిర్మించారు. దీనికి అనుసంధాన రోడ్లు వేయాల్సి ఉంది. రెండేళ్ల నుంచి ఈ పనులు అసంపూర్తిగా ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రహదారి మొత్తం గుంతలమయం కావడంతో ప్రయాణం నరకంగా మారింది. అనేకసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోగా, కొంతమంది క్షతగాత్రులయ్యారు. ఈ నేపథ్యంలో సిఎస్ జవహర్‌రెడ్డి, కలెక్టర్ డిల్లీరావు చొరవతో ఇటీవల మళ్లీ ప్రారంభమయ్యాయి. అలాగే ఇబ్రహీంపట్నం – జగదల్పూర్ జాతీయ రహదారిలో ఎ కొండూరు మండలం రామచంద్రపురం గ్రామం వద్ద విస్తరణ పనులు నిలిచిపోయ్యాయి. 2017లో రామచంద్రపురం గ్రామం వద్ద 70 గృహాల తొలగింపునకు అధికారులు మార్కింగ్ చేశారు. అయితే వీరిలో కొంతమంది ఇళ్ల తొలగింపునకు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు నిలిచిపోయాయి. నందిగామ ప్రాంతంలో రైతులకు, రామచంద్రపురంలో నివాసితులకు ప్రభుత్వ నిబంధనల మేరకు నష్టపరిహారం చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో పనులు పున: ప్రారంభమయ్యాయి. దీంతో రెవెన్యూ, పోలీస్, ఎన్‌హెచ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ విస్తరణ పనులకు చర్యలు చేపట్టారు.


రామచంద్రాపురం వద్ద ఇళ్లు తొలగిస్తున్న దృశ్యం


నందిగామ వద్ద నిలిచిన ఎన్‌హెచ్ పనులు

NAME CHANGE

I, Potluri Venkataramanamma W/o Venkateswara Rao, R/o D.No.32-9-4, Flat No: B-4, Suresh Residency, Moghalrajpuram, Vijayawada A.P India - 520010. have changed my name from POTLURI VENKATA RAMANAMMA to POTLURI VENKATA RAMANA an vide affidavit dated 07-11-2023 before Notary.

పాఠశాలల్లో మౌలిక వసతులకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : కార్పొరేట్ సామాజిక భాధ్యత సిఎస్ఆర్ నిధులతో పాఠశాలల్లో మరిన్ని మౌలిక వసతులను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్ డిల్లీరావు తెలిపారు. విద్యార్థులకు మంచి బోధన అందించి విద్యా ప్రమాణాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. విజయవాడ రూరల్ మండలం కుందావారి కండ్రిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న బోధన పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకుతోడు కార్పొరేట్ సంస్థల సహకారం కూడా అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు భోజనం చేసేందుకు హాల్ నిర్మించాలని ఉపాధ్యాయులు, స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సిఎస్ఆర్ నిధులతో డైనింగ్ హాల్ నిర్మాణానికి కషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ తహశీల్దారు కె.లక్ష్మి, ఇన్చార్జి ఎండిఒ శేషగిరిరావు, కండ్రిక మిల్క్ సొసైటీ అధ్యక్షుడు దేవిరెడ్డి మంగారెడ్డి, గొల్లపూడి ఏఎంసి మాజీ డైరెక్టర్ యరగొర్ల శ్రీరాములు, స్థానిక పెద్ద భీమిరెడ్డి సాంబిరెడ్డి పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

డెల్టా ఆధునీకరణపై నిర్లక్ష్యం

ఏర్పాటు చేసినా నామమాత్రంగానే పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఆరేళ్ల క్రితం 75 ఎకరాల్లో అశోక్ లేలాండ్ బాడీ బిల్డింగ్ యూనిట్ నిర్మించినా ఇప్పటికీ ప్రారంభించలేదు. తగిన ఆర్డర్లు లేక గుడివాడ ఆటోనగర్ ట్రాక్టర్ల విడి పరికరాలు, వ్యవసాయ పరికరాల తయారీ, బందరు రోల్డ్‌గోల్డ్ పరిశ్రమలు సంక్షోభంలో కూరుకుపోయాయి. జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన పోర్టు నిర్మాణాన్ని అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే ఎన్నికలకు 10 నెలల ముందుగా ఈ ఏడాది మేలో పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు.

కౌలు రైతులకు అరకొర రుణాలు

జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. అత్యధికంగా 3.50 లక్షల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో వరి సాగవుతోంది. 75 శాతం విస్తీర్ణంలో పంటలను కౌలు రైతులే సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 2 లక్షల మందికిపైగా కౌలు రైతులు ఉంటారని అంచనా. అయితే భూయజమాని ఆమోదంతోనే క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు (సిసిఆర్‌సి)లు ఇస్తామని నిబంధన పెట్టడంతో నాలుగో వంతు మందికి అంటే 50 వేల మందికే కార్డులు అందాయి. నిబంధనలు సాకు కౌలు రైతులకు చూపి బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయడం లేదు. రూ.3 వేల కోట్లకుపైగా పంట రుణాలు మంజూరు చేస్తే రూ.40 కోట్లు మాత్రమే కౌలు రైతులకు రుణాలుగా అందాయి.

అమలుకు నోచుకోని సిఎం హామీలు

ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో (పెడన, అవనిగడ్డ, మచిలీపట్నం, గుడివాడ)ల్లో పర్యటించారు. ఆయా నియోజకవర్గాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు ఇస్తున్నట్లు ప్రకటించారు. పెడన నియోజకవర్గ అభివృద్ధికి రూ.102.72 కోట్లు, అవనిగడ్డకు రూ.93.50 కోట్లు, మచిలీపట్నంనకు రూ.30 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కానీ నెలలు గడుస్తున్నా నిధులు మాత్రం విడుదల కాలేదు.

రేపు మరో జాతా

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం, మంతెన సీతారాం నేతృత్వంలో ఈనెల 2న శ్రీకాకుళం జిల్లా మందసలో ప్రారంభమైన ప్రజారక్షణభేరి బస్సు యాత్ర గురువారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఏలూరు జిల్లా కలిదిండి మీదుగా గుడివాడకు చేరుకుంటుంది. ఒంటి గంటకు గుడివాడ, 5 గంటలకు మచిలీపట్నంలో బహిరంగ సభలు నిర్వహిస్తారు. అనంతరం రాత్రికి చల్లపల్లి చేరుకుంటుంది. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు చల్లపల్లిలోని అమర్‌స్థూపం వద్ద యాత్ర ప్రారంభమవుంది. 11 గంటలకు పామర్రు, మధ్యాహ్నం ఒంటి గంటకు ఉయ్యూరు, సాయంత్రం 3 గంటలకు పోరంకిలో సభలు నిర్వహిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు యాత్ర విజయవాడకు చేరుతుంది.

దుర్గగుడి అభివృద్ధికి రూ.200 కోట్లతో ప్రణాళిక

దేవినేని అవినాష్, ఆలయ పాలకమండలి ఛైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామరావు, ఇఇలు కోటేశ్వరరావు, రమ, ఏసీపీ హనుమంతరావు, సీఐ సురేష్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈ కష్ణారావు పాల్గొన్నారు.



దస్తావేజు పోయినది

కతారి రాజ్యలక్ష్మి భర్త : శ్రీనివాసరావు, డోర్ నెం. 8/12, వెంట్రప్రగడ పోస్ట్, పెదపారుపూడి మండలం, కృష్ణాజిల్లా. అను నేను తెలియేయునది. నాకు గల ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 249/2007 తేది : 25-1-2007 ఎస్ఆర్ఓ గుడివాడ, వెంట్రప్రగడ గ్రామ రీసర్వే నెం. 143/4.5ర్లు లో 0.50 సెంట్లు శేరీ పల్లంభూమి. ఈ డాక్యుమెంట్ జిరాక్స్ నిమిత్తం వెంట్రప్రగడ నుండి గుడివాడ తీసుకెళుతుండగా జారిపోయినది. కనుక దొరికిన వారు ఈక్రింది నెంబర్‌కు ఫోన్‌చేసి అందజేయగలరు.

ఫోన్ : 9290505248, 8106327126

IN THE COURT OF THE HON'BLE III ADDL. DISTRICT AND SESSIONS JUDGE-CUM-II ADDL. MSJ-CUM-PRINCIPAL FAMILY COURT:: MEDCHAL-MALKAJGIRI DISTRICT AT KUKATPALLY

O.P.NO. 521 OF 2022

BETWEEN :

Smt. UppuSridevi w/o U. Uday Pushpa Kumar, aged about 34 Yrs., Occ: housewife, r/o Flat No.104, Vasavi Dreams Aparts., Street No.01, Czech Colony, Sanathnagar, Balanagar, Medchal-Malkajgiri District, Telangana. ... PLAINTIFF

AND

UppuUdaypushpa Kumar s/o Late PurnachandraPrasad, aged about 38 Yrs, Occ: Auto Driver, r/o H.No.4-4-13, Near Nagarala Sitharama swamyKalyan Mandapam, Rayappa Raju Street, Chittinagar Centre, I Town, Vijayawada, Krishna District. A.P. ...DEFENDANTS

To

The public in general are hereby informed that Smt. UppuSridevifiled the above OP for grant of divorce U/sec. 13(1)(ia)(ib) of Hindu Marriage Act, 1955. The above OP stands posted on **28-11-2023** for Appearance of the Respondent. You are herebydirectedtoappear in thiscourt in personorby a pleaderdulyinstruc tedonthe 28th day of November, 2023 at 10.30 O' clock before the above court i.e.,Hon'ble III ADDL. DISTRICTAND SESSIONS JUDGE-CUM-IIADDL.MSJ-CUM-PRINCIPAL FAMILY COURT, Medchal-Malkajgiri District at Kukatpallyand submit your grievances.

// BY ORDER OF THE COURT //

(G.SHANTI)
Advocate
Adjacent lane of Ganesh Weigh bridge, Near Court Complex, Prashanth Nagar, Kukatpally, Hyderabad – 500 072.
Cell : 91 98496 19000
COUNSEL FOR PETITIONER

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT SIDHOUT

O.S.No. 42/2023

కట్టా వెంకటలక్ష్మమ్మ, W/o కట్టా వెంకటరణ, డోర్‌నెం.3/6, బీసీ హాస్టల్ వీధి, కొత్తమాధవరం గ్రామం, ఒంటిమిట్ట మండలం, కడప జిల్లా. ...వాది

Vs

గుండ్లపల్లి రామాంజనేయరాజు, S/o జి.గంగరాజు, జూనియర్ అసిస్టెంట్, A.P.M.D.C. Ltd, 294/1D, 100 ఫీట్ రోడ్డు, కానూరు టు నిడమనూరు రోడ్డు, విజయవాడ. ...ప్రతివాది

దావా సమను

పై కనిన వాది, ప్రతివాది అయిన మీ పై ప్రోనోటు బాకీ నిమిత్తం పై పేర్కొన్న కోర్టులో పై కనిన దావాను దాఖలు చేసి యున్నారు. ఇందులకు మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 16-11-2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కనిన కోర్టు నందు స్వయముగా కాని, న్యాయ వాది ద్వారా గాని హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఖండితముగా తెలుపడమైనది.

//By the Order of the Court//
D.PRAVEEN, B.L.,
Advocate,
K.Madhavaram, KADAPA Dist.
Cell: 986636750.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT SIDHOUT

O.S.No. 43/2023

కొత్తపల్లి రమాదేవి, W/o కె.వెంకటసుబ్బయ్య, పి.కొత్తపల్లి గ్రామం, ఒంటిమిట్ట మండలం, కడప జిల్లా. ...వాది

Vs

గుండ్లపల్లి రామాంజనేయరాజు, S/o జి.గంగరాజు, జూనియర్ అసిస్టెంట్, A.P.M.D.C. Ltd, 294/1D, 100 ఫీట్ రోడ్డు, కానూరు టు నిడమనూరు రోడ్డు, విజయవాడ. ...ప్రతివాది

దావా సమను

పై కనిన వాది, ప్రతివాది అయిన మీ పై ప్రోనోటు బాకీ నిమిత్తం పై పేర్కొన్న కోర్టులో పై కనిన దావాను దాఖలు చేసి యున్నారు. ఇందులకు మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 16-11-2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కనిన కోర్టు నందు స్వయముగా కాని, న్యాయ వాది ద్వారా గాని హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఖండితముగా తెలుపడమైనది.

//By the Order of the Court//
D.PRAVEEN, B.L.,
Advocate,
K.Madhavaram, KADAPA Dist.
Cell: 986636750.

ఆస్థి వేలం ప్రకటన
మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, విజయవాడ

E.P No.67/2015 in OS No.675/2010

బిట్వీన్:
సిమ రవికిరణ్ ...డిక్రిహోల్డర్
And
వడ్డి శంకరవర్మ (died) others
...జడ్జిమెంట్‌డెటార్స్

పైన తెల్పిన వాది పై నెంబరు దావాలో డిక్రిపొంది సదరు సొమ్ము ప్రతివాది చెల్లించుటలో విఫలము అయినందున E.P దాఖలు చేసి క్రింది జతపరచిన షెడ్యూలు లో ఉదహరించిన జప్తు చేయబడినటువంటి ఆస్థిని విక్రయించుటకు గాను కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున 22-11-2023వ తేదిన ఉదయం 10-30 గం॥లకు లగాయితు పైన తెల్పబడిన కోర్టు హాలు లో బహిరంగ వేలం వేసి విక్రయించబడును. షెడ్యూలులో నిర్ణయించబడిన E.P వారంటు బకాయి వేలం ద్వారా రాబట్టుకోనుటకు వేలం జరపబడును. వేలం షరతులను తప్పని సరిగా పాటించవలెను. కావున వేలంలోని షరతులను తప్పని సరిగా పాటించవలెను. కావున వేలంలోని షరతులకు అంగికరించి కోర్టువారు స్పష్టమైన అనుమతులతో ఇష్టమైన వారు బహిరంగవేలంలో పాల్గోనగలరు.

వేలం స్తిరాస్థి

షెడ్యూలు:– విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పటమట సబ్‌రిజిస్ట్రారు యన్.టి.ఆర్ డిస్ట్రిక్ట్ లో ఉన్న 0.62 గజాల స్థలములోని ప్రస్తుత ఉన్న RCC బిల్డింగ్, House No.68-6-5, మున్సిపల్ వార్డు నెం.32/3, గ్రామ కంఠం, R.S.No.81, అస్సెస్‌మెంట్ 32577, పటమట.

Boundaries
East:- Property Belongs to Thadisetti Kotaiah,
South:- Property Belongs to Patamata Rama Koteswara Rao,
West:- Property of Defendant Vender,
North:- Property of Vaddi Chalapathi Rao
D.H.R Value:- 6,00,000/-
Amina Value:- 10,00,000/-

విజయవాడ
తేది:7-11-2023

పిచ్చుక శ్రీనివాసు,
అడ్వకేట్,
విజయవాడ, సెల్.నెం.**9849770625**

ప్రకటన

నా క్లయింట్ అయిన యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ రూరల్ మండలం, నున్న గ్రామం, చింతల బజారు, రంగా బొమ్మ సెంటర్, సెకండ్ ఫ్లోరు, ఫ్లాటు నెం.104 రు కాపురస్తులు రుద్రరాజు విజయ భాస్కర్ గారి భార్య రుద్రరాజు ఇందిర గారికి ది. 06-10-2005వ తేదీన వారి తండ్రి గారు అయిన కుచ్చర్లపాటి రామమోహనరాజు గారి వలన దాఖలు పొంది, శ్రీ విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, నెం.8683/2005 రుగా రిజిస్టరు కాబడిన దాఖలు దస్తావేజు రీత్యా విజయవాడ రూరల్ మండలం, నున్న గ్రామ ఆర్.యస్.నెం.718/3 యల్.పి.నెం.6/2005, ఫ్లాటు నెం.4,5 ర్లు దాఖలా చ.గ.534-11లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలము సంక్రమించిన దర్మిలా రుద్రరాజు ఇందిర గారు సదరాస్తిని స్వాధీనపరచుకొని తదాది నేటివరకు సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో నిర్వివాదముగా అనుభవించుచూ యుండి యున్నారు.

యిట్టిస్థితిలో ది.27-10-2023వ తేదీన నా క్లయింటు హైదరాబాద్ నుండి విజయవాడ బస్టాండులో దిగి టీ తాగటానికి వెళ్లి వచ్చి చూసుకొనగా పై తెల్పిన ఒరిజినల్ దఖలు దస్తావేజు నెం.8683/2005 మరియు లింకు దస్తావేజులు నెం.4993/2005 ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. చుట్టుప్రక్కల ఎంత వెతికిననూ కనిపించలేదు. కనుక సదరు దస్తావేజులు ఎవ్వరికైనా దొరికినచో నా క్లయింట్ అయిన రుద్రరాజు ఇందిర గారికి గానీ, నాకు గానీ అందజేయగలరు. అలా అందచేసి నట్లయితే తగిన ప్రతిఫలం కూడా ఇవ్వగలమని తెలియజేయడమైనది. పైన ఉదహరించిన ఒరిజినల్ దస్తావేజులను తెలియపరచకుండా ఏమైనా ఎగ్రిమెంట్లు గానీ, తనఖాలు గానీ, హామీలు గానీ వుంచినచో నా క్లయింటును బైండు చేయజాలవు. సదరు దస్తావేజులు దొరికిన యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 10 రోజులలోపుగా రిజిస్టరు పోస్టు విత్ ఎక్నాలెడ్జిమెంటు ద్వారా తెలియపరచవలెను. దరిమిలా వచ్చే ఎట్టి క్లయిములు గానీ, అభ్యంతరములు గానీ నా క్లయింట్సుపై ఎంత మాత్రము బైండు చేయజాలవని ఇందుమూలముగా తెలియజేయటమైనది
తేదీ:

G.Siva Prasada Raju B.Com., B.L.,
Advocate & Notary,
#23-5-6, Vandanapu Vari Street,
Satyanarayanapuram,
Vijayawada-520011
Cell:9948084840

నేడు బంద్‌ను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుడివాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ను పరిరక్షించాలని కోరుతూ చేపట్టిన ఉద్యమం వెయ్యి రోజులు పూర్తయిన నేపథ్యంలో మద్దతుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థలు బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం తెలిపారు. గుడివాడ సుందరయ్య భవనంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ బంద్‌లో విద్యార్థులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్ సమీర్, సలీం, వంశీ పాల్గొన్నారు. **ఉయ్యూరు:** విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నిమ్మాది నివాస్, ఎస్ఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి ఇ.ఫ్రేమ్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో పుట్టుకొచ్చిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటుకు కారుచౌకగా అప్పగించాలని చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహిత్ తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం:** విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని వాల్‌పోస్టర్లు గోడలకు అతికిస్తూ ప్రచారం చేయడం జరిగిందని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి చిల్లర రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం

'మమతల పందిరి' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: బాపులపాడు మండలం పలు ప్రాంతంలో సేవలందిస్తున్న మమతల పందిరి సేవా సమితి సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. మమతల పందరి 87వ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం హనుమాన్ జంక్షన్ ఏపూరు గట్టు మీద నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు మమతల పందిరి అధ్యక్షుడు లంక రమేష్ ఆధ్వర్యంలో అన్నదానం వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూచిపూడి అజేష్ చౌదరి హేమలత కుమార్తె చేతన మొదటి పుట్టినరోజు సందర్భంగా వారి సహకారం గ్రూపు సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పునుకొల్లు తేజ, డాక్టర్ గణేష్ స్వామీజీ, కంపసాటి కొండలు, సాంబశివ రాయల్ స్వామీజీ దుర్గాప్రసాద్, బొచ్చా శేఖర్, రాజేశ్వరావు, మత్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.





జూడో పోటీల్లో శ్రావణి ప్రతిభ

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు జూడో లాంటి సాహసక్రీడల్లో రాణిచడం అభినందనీయమని ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితుల్లో స్వీయరక్షణకు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం తప్పనిసరి అని అనంతపురం ఎంపీ గోరంట్ల మాధవ్ సూచించినట్లు టైగర్ పవర్ క్లబ్ అధినేత వర్రే అంజిబాబు మంగళవారం తెలిపారు.గొల్లనపల్లి హైస్కూల్వి ద్యార్థిని బచ్చు శ్రావణి రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ చూపి బంగారుపతకం సాధించి ఆయన చేతులమీదుగా అందుకుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించిన జూడో టోర్నమెంట్లో అండర్ 14 విభాగంలో బచ్చు శ్రావణి బంగారుపతకం సాధించి నవంబరు 11వతేదీ నుండి జమ్ముకాశ్మీర్లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు కష్ణాజిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షుడు అంజిబాబు వివరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచి బంగారుపతకాన్ని కైవసం చేసుకున్న శ్రావణిని జూడో సంఘ ఉపాధ్యక్షుడు విద్యాధరరావు, వి.డి.ఎస్. ప్రసాద్. వ్యాయామోపాధ్యాయులు శ్రీను, రవీంద్ర తదితరులు అభినందించారు.

ఆటోనగర్‌లో సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ ఆటోనగర్‌లోని పలు సమస్యలను పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. గుడివాడ ఆటోనగర్‌లో కృష్ణా డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఆటో మొబైల్ వర్కర్స్ యూనియన్ ఆటోనగర్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గుడివాడ ఆటోనగర్ ను 1979 వ సంవత్సరంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ట్రాన్స్పోర్ట్ రంగం నుండి దక్షిణ భారతదేశంలోనే గుడివాడకు గుర్తింపు ఉందన్నారు. దేశంలో వ్యవసాయ పరికరాలకు పంజాబ్ తర్వాత గుడివాడ ముందు ఉందన్నారు. ఆటోనగర్లో 25 రకాల పనులు చేసుకుంటూ 700 మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఆటోనగర్ విస్తరణ పనులు జరపాలని, త్రాగునీరుఅందించాలని, సులభ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని, దొంగతనాలు నివారించాలని, లైట్లు వేయించాలని, విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేయాలని, నిరుపయోగంగా ఉన్న త్రాగునీటి పైప్లైన్లను ఉపయోగించే ఏర్పాటు చేయాలని, ఆటోనగర్ ను పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రధానంగా డిమాండ్ లో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి గంధం డేవిడ్, కోశాధికారి రెడ్డి నాగరాజు, సహాయ కార్యదర్శిలు జోగా నాగేశ్వరరావు, కూనపరెడ్డి దుర్గా రాంబాబు, అన్నమనేడి వెంకట రమణ, ఉపాధ్యక్షులు మేడా పరమేశ్వర రావు, మదిరి శ్యామ్, షేక్ ఖాజా మొహిద్దిన్, కమిటీ సభ్యులు అబ్దుల్ కుద్దూస్, షేక్ రెహమాన్, గేదెల త్రినాథ్, బొబ్బురపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ మండలంలోని కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన రహదారులపై మంగళవారం అతివేగంగా, అజాగ్రత్తగా ద్విచక్ర వాహనాలను నడిపే వాహరదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేసినట్లు కూచిపూడి ఎస్సై డి. సందీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపడం నేరమని, వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విఎన్‌పురంలో టపాసుల దుకాణాలు

ప్రజాశక్తి-గన్నవరం: దీపావళి పండుగ సందర్భంగా గన్నవరం పట్టణంలో తాత్కాలిక షాపులు 32 నుంచి 36 వరకు ఏర్పాటు చేస్తారు. గతంలో కోనయ్య చెరువు వద్ద ఉన్న శివాలయం పక్కన షాపులు ఏర్పాటు చేసేవారు. ఈసారి ఆగిరిపల్లి రోడ్లో చెత్తను తగలబెట్టడం వల్ల ఏదైనా సమస్య వస్తుందని అధికారులు ముందుగానే షాపులు ఏర్పాటు చేయడం కుదరదని చెప్పేశారు. దీంతో షాపుల నిర్వాహకులు వెంకట నరసింహపురం దగ్గర ఉన్న హరివిల్లు వెంచర్లు వద్ద షాపులు పెట్టుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇళ్లకు దగ్గరలో షాపులు పెట్టకూడదని నిబంధన ఉన్నా రాజకీయ ఒత్తిడి మేరకు వెంచర్ల వద్ద పెట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే షాపులకు అనుమతులు ఇవ్వడానికి శాఖల వారీగా సొమ్ము చెల్లించాలని వాదన వినిపిస్తుంది. అందుకోసం ఒక్కో షాపుకు రూ.25 వేలు దాకా ఖర్చు అవుతుందని ఓ వ్యక్తి చెప్పడం గమనార్హం. షెడ్లు వేసి షాపు పెట్టుకునేందుకు, ఇతర ఖర్చులకు మరో రూ.50 వేల వరకు అవుతుందని ఆర్గనైజర్ చెప్పినట్లుగా ఓ వ్యాపారి తెలిపారు. ఇంత ఖర్చు పెట్టి షాపు పెడితే ఎంతవరకు విక్రయాలు జరుగుతాయోననే అనుమానం వ్యాపారుల్లో ఉంది. ఈ ఏడాది విజయవాడలో షాపు లైసెన్సులు రద్దు చేయడంతో అక్కడివారు గన్నవరంలోని హోల్‌సేల్ దుకాణాలపై పడ్డారు. దీంతో ఇక్కడి వ్యాపారులు రేట్లు పెంచేశారని వాదన ఉంది. మూడు నెలల ముందుగా టపాసులు కొనుగోలు చేసి దాచుకున్న తాత్కాలిక వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇష్టం వచ్చిన రేట్లకు అమ్మితే జనం కొనుగోలు చేస్తారా.. విక్రయాలు జరుగుతాయా? అని చర్చించుకుంటున్నారు. అయితే షాపులు ఏర్పాటు చేసే వెంకటనరసింహపురం కాలనీ వెనుక చంద్రిక అయోధ్య అపార్టుమెంట్లో రోజుకు ఐదు వేల మంది పని చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పెద్దఎత్తున నష్టం జరుగుతుందని భయాందోళనలో కాలనీవాసులు ఉన్నారు. దీనిపై అధికారులు ఒక్కసారి ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-మొవ్వ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తొలిసారిగా 2021 లో ప్రవేశపెట్టిన వైయస్సార్ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లోని శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్యకళా పీఠం ఆ నిధులతో అభివద్ధి పనులు చేపట్టింది. ఆ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తంగెడ కిషన్ రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ల సూచనలతో ఓఎస్‌డి నిరీక్షణ బాబు పర్యవేక్షణలో ప్రధాన రహదారి పనులను చేపట్టారు. వైయస్సార్ జీవిత సాఫల్యం పురస్కారం కింద కళా పీఠానికి రూ.10 లక్షలను నగదు బహుమతిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రధానాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి అందుకున్నారు. రెండు నెలల క్రితం పనులను ప్రారంభించడానికి విశ్వవిద్యాలయం సాంకేతిక సిబ్బంది సన్నాహాలు చేశారు. అయితే అప్పట్లో కురిసిన అధిక వర్షాలు మూలంగా పనికి తాత్కాలికంగా వాయిదా పడింది. కాగా గత నెల 15న కూచిపూడి నాట్య లెజెండ్ పద్మభూషణ్ డాక్టరు చినసత్యం జయంతి వేడుకల సందర్భంగా రహదారిని కొంత మెరుగుపరిచారు. ఈ నేపథ్యంలో మంగళవారం రహదారి పనులకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగానే రోలింగ్ బండతో రోలింగ్ చేయించి సిమెంటు రోడ్డు ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించారు.

ఎన్‌జి రంగా జయంతి

ప్రజాశక్తి-ఘంటసాల: భారత రైతాంగ ఉద్యమ పిత, స్వాతంత్ర సమర యోధుడు, పార్లమెంటేరియన్, పద్మభూషణ్ ఆచార్య యన్.జి.రంగా 123వ జయంతి ఘంటసాలలోని ఖుషి విజ్ఞాన కేంద్రం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా ఘంటసాల గ్రామంలో యన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలో వున్న వ్యవసాయ పరిశోధనా స్థానం వ్యవసాయ పాలీటెక్నిక్ కళాశాల, ఘంటసాల కషి విజ్ఞాన కేంద్రం పరిధిలో పనిచేస్తున్న 8 మంది సైంటిస్టలను కృష్ణాజిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మెన్ గొర్రెపాటి రామకృష్ణ, ఆనాటి యన్.జి.రంగా అనుచరులు గొర్రెపాటి చంద్రశేఖరరావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-బంటుమిల్లి: బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల శ్రీ వినాయక నాయి బ్రాహ్మణ సంఘం మండల కమిటీ సమావేశం జరిగినది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగినది .అధ్యక్షులుగా బంటుమిల్లి నుండి మాటూరి కుమార్, ఉపాధ్యక్షులుగా మల్లేశ్వరం నుండి దేవరపల్లి శ్రీను, సెక్రటరీగా బంటుమిల్లి నుండి మేడూరి సాయి, జాయింట్ సెక్రటరీగా పాంద్రాక నుండి జంపన సాయి, కోశాధికారిగా నీలిపూడి నుండి ముత్యాలపల్లి దుర్గారావు, నెంబర్స్‌గా బాబి, కోడూరి సాయి చైతన్య , సాయి బాలాజీ ని ఎన్నుకోవడం జరిగినది. మాజీ అధ్యక్షులు పొదిలి వెంకన్న నూతన అధ్యక్షునికి స్వీటు తినిపించి హర్షం వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గూడూరు: పెడన రైల్వే ట్రాక్ పై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుమారు 40 సంవత్సరాల వయసు కలిగిన ఒక వ్యక్తి ముదురు బ్లూ రంగు షార్టు బిస్కెట్ రంగు గల ఫుల్ హ్యాండ్ షర్ట్ వేసుకుని ఉన్న వ్యక్తి గుడివాడ నుంచి మచిలీపట్నం వెళ్తున్న ప్యాసింజర్ రైలు కింద పెట్టనా బైపాస్ రోడ్ లోని రైల్వే గేట్ సమీపంలో ఉన్నటువంటి గుర్రపు పాలెం గ్రామం వద్ద ఉన్న రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నట్లుగా తెలుస్తుంది. మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.

పార్ట్‌టైం సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగుల సంఘం జెఎసి ఆధ్వర్యంలో మంగళవారం కృష్ణాజిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాములు నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.సమగ్ర శిక్ష ద్వారా విద్యా హక్కు చట్టంలో భాగంగా కృష్ణా జిల్లాలో వివిధ ప్రభుత్వ జిల్లా పరిషత్ మున్సిపల్ హైస్కూల్లో క్రాఫ్ట్ ఆర్ట్ లుగా పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్నా తమ సమస్యలను పరిష్కరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.విద్య హక్కు చట్టం ప్రకారం పాఠశాల లో విద్యార్థినీ విద్యార్థుల యొక్క మానసిక వికాసం కొరకు కళా నైపుణ్యాలు కలిగిన టీచర్లుగా పని చేసేందుకు సమగ్ర శిక్ష ద్వారా 2012 లో నియమింప బడి స్కూళ్లలో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లను నాడు నేడు పనుల నిమిత్తం తమ ఆఫీసులో డిప్యూటేషన్ పైఎక్కువ కాలం కొనసాగించడం వలన హెచ్ఎంల ద్వారా భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని కావున దీర్ఘకాలకంగా పని చేస్తున్న పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ల ను రిలీవ్ చేసి స్కూళ్లకు పంపించేల చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పెండింగ్ లో ఉన్న సెప్టెంబరు, అక్టోబర్ వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ల పని వేళలు మధ్యాహ్నం సెషన్ నుంచి వెళ్లేలా జీవో ఉన్నప్పటికీ కొన్నిచోట్ల హెచ్ఎంలు రెండు పూట్ల రావాలని హుకుం జారీ చేస్తున్నరని , ఒక పూట జీతంతో కుటుంబ పోషణ చాలక పోవటం వలన రెండో పూట ఏదో ఒక పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాము అట్లాంటి చిరుద్యోగులమైన మాపై హెచ్ఎంలు ఇబ్బందులు పెట్టకుండా తమ ద్వారా జీవో కాపీని మరల ఎంఈఓ ల ద్వారా ప్రతి స్కూల్ కి పంపించి తమకు న్యాయం చేయలన్నారు. అర్జీ ఇచ్చిన వారిలో కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు అలాగే పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ల రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ ఎన్. దేవేంద్రరావు జిల్లా అధ్యక్షురాలు గడిదేసి వనజ ,జిల్లా గౌరవ సలహాదారులు అంకాని శేషుబాబు, జిల్లా నాయకులు లంకపల్లి సుజాత, లేళ్ల అశోక్, పేర్ని శ్రీదేవి, విశాలాక్షి, సూర్య కళ తదితరులు పాల్గొన్నారు.


రాములునాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

టిడ్కో ముసుగులో ఇసుక దందా : టిడిపి

ప్రజాశక్తి-ఉయ్యూరు: గండిగుంటలో పలు చోట్ల ఇసుక డంప్‌పై వాస్తవం కప్పి పుచ్చేందుకు వైసీపీ నాయకులు నానాతంటాలు పడుతూ టిడ్కో గృహాల సాకు చూపి ఇసుక దందా మాట మారుస్తున్నారని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం టిడిపి నాయకులు యెనిగళ్ల కుటుంబరావు, జంపాన పూర్ణచంద్రరావు, జంపాన గుర్నాధరావు, ఖుద్దూస్ విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఇసుక మాఫియా వ్యవహారాన్ని బోడె ప్రసాద్ బట్టబయలు చేయడంతో గుమ్మడికాయల దొంగల్లా అధికార పార్టీ నాయకులు భుజాలు తడుము కుంటున్నారని ఎద్దేవా చేశారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం టీడీపీ ప్రభుత్వం మూడొంతులకు పైగా పూర్తిచేస్తే వైసీపీ నాలుగున్నర సంవత్సరాలైన పూర్తిచేసి ఇవ్వలేక పోయిందని, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టిడ్కో ఇళ్లు గుర్తొచ్చాయా అని ప్రశ్నించారు. టిడ్కో ఇళ్ల వరకు ఇసుక లారీలు వెళ్లే అవకాశం ఉండగా దూరంగా ఎందుకు గుట్టలు పోశారని ప్రశ్నించారు. టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా టీడీపీ నాయకులు అడ్డుపడుతున్నారని బురద చల్లేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని పరిరక్షించుకోవాలి

కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : పురాతన కాలం నుండి వస్తున్న ఆయుర్వేద వైద్యాన్ని పరిరక్షించుకొని తరతరాలకు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు అన్నారు. ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ, సిసిఆర్ఎఎస్, కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎనిమిదవ ఆయుర్వేద దినోత్సవ సందర్భంగా బిఆర్టిఎస్ రోడ్డులో ఏర్పాటుచేసిన ర్యాలీని జిల్లా కలెక్టర్ డిల్లీరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీ రావు మాట్లాడుతూ పురాతన కాలం నుండి వాడుకలో ఉన్న వైద్యం ఆయుర్వేదం అన్నారు. ఆధునిక వైద్యానికి లొంగని కొన్ని రకాలైన దీర్ఘకాలిక వ్యాధుల్ని సైతం నయం చేసే గుణం ఆయుర్వేదానికి ఉందన్నారు. ఇతర వైద్య విధానాలతో పోలిస్తే ఆయుర్వేదం చాలా ప్రాచీనమైనదని ఈ వైద్యాన్ని గ్రామస్థాయి నుండి తరతరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆయుర్వేదం కొంచెం వెనకబడినా ప్రస్తుత కాలంలో తిరిగి ప్రాచుర్యం సంతరించుకుంటుందన్నారు.

స్పందనలేని 'పల్లెకుపోదాం'

ప్రజాశక్తి - గంపలగూడెం : వైసిపి మండల పార్టీ శ్రేణుల్లో అసమ్మతి కొట్టొ చ్చినట్లు కనపడింది. మంగళ వారం సాయంత్రం తిరు వూరు ఎమ్మెల్యే కె.రక్షణ నిధి సాక్షాత్తు గంపల గూడెం మండలానికి వచ్చిన ప్పటికీ నాయకులు గైర్హాజరు కావడం పట్ల పలు అను మానాలకు తావిస్తోంది. ఈ నెల 9 నుండి 23 వరకు జరగనున్న పల్లెకి పోదాం కార్యక్ర మంలో భాగంగా నాయకులను సమాయత్తం చేసేందుకు ఎమ్మెల్యే రక్షణ నిధి విచ్చేసినట్లు తెలిసింది. అయితే ఈ కార్యక్రమాలు కనుమూరు నుండి మేడూరు వరకు అనగా 10 సచివాలయాల పరిధిలో డిజైన్ చేసినట్లు తెలిసింది. ఒక గంపలగూడెం నాయకులు మాత్రమే వచ్చినట్లు సమాచారం. ఇది ఇలా ఉంటే వరుసగా ఏటవతల గ్రామాలను ఎంపిక చేయడం పట్ల పలు అనుమానాలకు తొవిస్తోంది. దీంతో ఎమ్మెల్యే వచ్చిన కొద్ది మందితోనే ఎంపీపీ కార్యాలయంలో మాట్లాడి, తిరువూరు వెళ్లినట్లు తెలిసింది.



ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అండర్ -19 బ్యాడ్మింటన్ పోటీలు నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. బాల, బాలికలకు విడి విడిగా జరుగుతున్నాయి. పోటీల నిర్వహణకు గానూ ఆరు కోర్టులను సిద్ధం చేసి పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రవికాంత తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభావంతులను అండర్ -19 బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన జట్టు విజయవాడలోనే జరగనున్న స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటుందని తెలిపారు. తొలిరోజ జరిగిన అండర్ -19 బాలికల ఫలితాలను తెలియచేశారు. ఫూల్ ఎలో విశాఖపట్నం జట్టు 2-0 పాయింట్లతో వెస్ట్ గోదావరి జట్టుపై, ఫూల్ బిలో చిత్తూరు జట్టు 2-0 పాయింట్లతో నెల్లూరు జట్టుపై, మరో మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 2-0 పాయింట్లతో గుంటూరు జట్టుపై విజయం సాధించాయి. ఫూల్ సిలో వైఎస్ఆర్ కడప జట్టు 2-0 పాయింట్లతో విజయనరం జట్టుపై, మరో మ్యాచ్‌లో కడప జట్టు 2-0 పాయింట్లతో కర్నూలు జట్టపై విజయం సాధించాయి. ఫూల్ డిలో కృష్ణా జట్టు 2-0 పాయింట్లతో అనంతపూర్ జట్టుపై, మరో మ్యాచ్‌లో కృష్ణా జట్టు 2-0 పాయింట్లతో ఈస్ట్ గోరావరి జట్టుపై విజయం సాధించాయి. సెమి ఫైనల్స్ మ్యాచ్‌లనో విశాఖపట్నం జట్టు 2-0 పాయింట్లతో వైఎస్ఆర్ కడప జట్టుపై, కృష్ణా జట్టు 2-0 పాయింట్లతో చిత్తూరు జట్టుపై విజయం సాధించాయి.

సన్‌సిరి ప్రాజెక్ట్స్‌తో ప్రయాణం... అభివృద్ధికి సోపానం...



విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ, చిలకలూరిపేట, పిడుగురాళ్ళ, అద్దంకి వంటి ప్రముఖ పట్టణాల్లో పలు ప్రాజెక్ట్‌లను పూర్తి చేసి, రియల్ ఎస్టేట్ రంగంలో తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకునిన్న సంస్థ "సన్ సిరి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్"అని సంస్థ అధినేత భాష్యం రాజేష్ (మేనేజింగ్ డైరెక్టర్) అన్నారు. ఫ్లాట్స్ కొనుగోలుదారులకు అత్యున్నత సౌకర్యాలతో కూడిన రియల్ ఎస్టేట్ వెంచర్స్‌ను అందించడమే కాకుండా వారి కలలను సాకారం చేసుకోవడానికి ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రజాశక్తితో మాట్లాడుతూ నగరంల్లో ఉన్న ప్రముఖ రియల్ ఎస్టేట్ ఏజెన్సీలలో ఒకటిగా, రియల్ ఎస్టేట్ లేఅవుట్‌లు, డెవలప్‌మెంట్‌లలో 8 సంవత్సరాలకు పైగా రియల్ టైమ్ అనుభవం ఉన్న ప్రముఖ సంస్థ తమది అని పేర్కొన్నారు. తమ సంస్థ ప్రారంభమై ఇప్పటికి ఎనిమిదేళ్లు పూర్తయిందని, 2015వ సంవత్సరంలో ఒక సాధారణ రియల్ ఎస్టేట్ సంస్థగా తమ సంస్థను ప్రారంభించామని, కస్టమర్ల ఆదరాభిమానాలు, ఆశీస్సులతో చక్కని అభివద్ధిని సాధించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం విజయవాడ నగరంలో అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీ, క్లబ్ హౌస్ సదుపాయం, వ్యక్తిగత గహాలు, విల్లాలతో పాటు అన్ని సౌకర్యాలతో, అత్యాధునిక వసతులతో ఒకే పైకప్పు క్రింద 15 ఎకరాలు విస్తీర్ణంలో "గ్రీన్ డిలైట్ ప్రైడ్" (PRIDE) పేరుతో నెప్పల్లిలో తమ సరికొత్త వెంచర్‌ను, విజయవాడ నగర గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివద్ధి చెందుతున్న బందర్ రోడ్డుకు అనుకోని ఇన్నర్ రింగ్ రోడ్డుకి ఎదురుగా, 60,40 అడుగుల వెడల్పు గల సువిశాలమైన రోడ్లతో తక్షణ గహ నిర్మాణానికి అనువైన సిఆర్‌డిఎ అప్రూవల్ ప్లాట్లను 25 ఎకరాల్లో ప్రతిష్టాత్మకమైన గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టు "గ్రీన్ డిలైట్ ఎంపైర్"పేరుతో మరో సరికొత్త వెంచర్‌ను పెనుమలూరులో ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కస్టమర్ల ఆదరాభిమానాలే సోపానాలుగా ఈ రంగంలో అభివద్ధి పథంలో పయనిస్తున్నామని కేవలం 8 ఏళ్లలో 16 వెంచర్లు చేపట్టి విజయవంతంగా పూర్తి చేశామని భాష్యం రాజేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకూ 3 వేల మందికి పైగా ఉన్న సంతోషకరమైన కస్టమర్లే తమ సంస్థ అభివద్ధికి నిదర్శనమని అయన పేర్కొన్నారు. ఓపెన్ ఫ్లాట్స్, విల్లాస్, ఇండిపెండెంట్ హౌస్ కొనుగోలుదారులకు సన్ సిరి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఒక అద్భుతమైన అవకాశం అని ఆయన తెలిపారు. వివరాలకు విజయవాడ, విజయనగర్ కాలనీ పటమటలో గల తమ ఆఫీస్‌లో సంప్రదించవచ్చాన్నారు.

క్రీడల్లో రాణించిన వారికి ప్రాధాన్యత :మేయర్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, క్రీడల్లో రాణించిన వారికి తగిన విధంగా ప్రోత్సాహం అందిస్తుందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. మొగల్‌రాజపురంలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో కృష్ణాజిల్లా అండర్ -19 స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో క్రీడలను అభివృద్ధి పరచేందుకు ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటుచేసి దానికి అనుగుణంగా క్రీడా పోటీలను నిర్వహిస్తుందన్నారు. డైరెక్టర్ ఆఫ్ దనరి స్కూల్ ఎడ్యుకేషన్ పి.పార్వతి మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ప్రణాళికా ప్రకారం అన్ని కేటగిరిలలోనూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయి పోటీలు విజయవావలో నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ ప్రతిభావంతులైన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపికచేస్తామని ఎంపికైన రాష్ట్ర జట్టు జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మ చౌదరి మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడ ఆడటం వలన ఎంతో మంది క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించారని వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.రవికాంత, కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. వెంకటేశ్వర్లు, పలువురు క్రీడాకారులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



మేయర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నేడు బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్స్



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : యోనెక్స్ - సన్‌రైజ్ ఆలిండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీలు ఫైనల్స్ పోటీలు బుధవారం నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరుగనున్నాయి. మంగళవారం సెమి ఫైనల్స్ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. అండర్ -15, అండర్ -17 బాల బాలికల విభాగంలో ఫైనల్స్ పోటీలు బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుల ఎం.ద్వారకానాథ్ తెలిపారు. ఈ సందర్భంగా సెమి ఫైనల్స్ ఫలితాలను తెలియచేశారు. **అండర్ -15 :** బాలుర విభాగంలో ప్రతీక్ కౌండిల్య (కర్ణాటక) 13- 21, 21-13, 21-10 పాయింట్లతో సుశాంత మోయిరంగటన్ (మణిపైర్)పై విజయం సాధించి ఫైనల్స్‌కు ప్రవేశించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అఖిల్ రెడ్డి బొబ్బా 21త-12, 21-19 పాయింట్లతో ప్రణవ్ ఎం.(కర్ణాటక)పై విజయం సాధించి ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. బాలికల విభాగంలో ఎస్.ఆర్.దీక్ష (తమిళనాడు) 21-15, 21-14 పాయింట్లతో ఎల్.రాజయ్య (కర్ణాటక),పై, తన్విపత్రి (ఒరిస్సా) 21-14, 2-1-6 పాయింట్లతో ఎ.మోక్షిత(తమిళనాడు)పై విజయం సాధించి ఫైనల్స్‌కు ప్రవేశించారు. బాలురు డబుల్స్ విభాగంలో అఖిల్ రెడ్డి బొబ్బా - అభిషేక్ బాను (ఆంధ్రప్రదేశ్) జోడి 23-21, 21-13 పాయింట్లతో కృష్ణ కురసం - గిరివాసన్ శ్రవణ్ కుమార్ (తెలంగాణ)జోడిపై విజయం సాధించి ఫైనల్స్‌కు అర్హత సాధించారు. **అండర్ -17 :** బాలుర విభాగంలో ప్రతీక్ కౌండిల్య (కర్ణాటక) 13-21, 21-13,21-10 పాయింట్లతో సుగి సాయి బాల సింగ్ (తమిళనాడు)పై, టి.జె.సచిన్ (తమిళనాడు) 21-13, 21-14 పాయింట్లతో అభినవ్ గార్గ్ (కర్ణాటక)పై విజయం సాధించి ఫైనల్స్‌కు ప్రవేశించారు. బాలికల విభాగంలో తన్వి పత్రి (ఒరిస్సా) 21-14, 21-14 పాయింట్లతో జడే అనిల్ (కర్ణాటకపై విజయం సాధించి ఫైనల్స్‌కు అర్హత సాధించారు. డబుల్స్ విభాగంలో నైషా కౌర్ (మహారాష్ట్ర)- దుర్గా ఇషా కందరపు (ఎపి) 21-12, 21-17 పాయింట్లతో అనన్య బిషత్ (ఉత్తరప్రదేశ్)- ఇషిత నేగి (డిల్లీ)పై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నారు.



మాక్సీ విజన్‌లో అత్యాధునిక వైద్య సేవలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : మాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ నేత్ర వైద్యశాల అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నట్లు మాక్సివిజన్ ఐ హాస్పటల్స్ చైర్మన్ డాక్టర్ జీఎస్‌కే వేలు తెలిపారు. నగరంలోని ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలను తెలియచేశారు. నేత్ర వైద్య సేవలను ప్రతి ఒక్కరికీ అందించేందుకుగానూ ఆసుపత్రి బ్రాండ్ అంబాసిడర్‌గనా మహేంద్ర సింగ్ ధోనీని ఎంపిక చేసినట్లు తెలిపారు. 40కి పైగా నెట్‌వర్క్ ఆసుపత్రులలో ప్రతిరోజూ మాక్సి విజన్ వేలాది మంది రోగులకు కంటి సంరక్షణా సేవలను అందిస్తున్నామని తెలిపారు.



అవార్డు అందుకున్న రామచంద్రయాదవ్

రామచంద్ర యాదవ్‌కు 'చాంపియన్స్ ఆఫ్ చేంజ్' అవార్డు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన 'ఛాంపియన్స్ ఆఫ్ చేంజ్' అవార్డును భారత చైతన్య యువజన (బిసివై) పార్టీ అధినేత బొడే రామచంద్ర యాదవ్ అందుకున్నారు. దేశంలో వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు ఈ అవార్డులను ప్రతి ఏటా ప్రదానం చేస్తుంటారు. సామాజిక సేవా విభాగంలో రామచంద్ర యాదవ్‌కు ఈ అవార్డు లభించింది. మంగళవారం బెంగులూరులో జరిగిన ఈ కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ తవార్ చంద్ గెహ్లాట్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుండి రామచంద్ర యాదవ్ ఒక్కరికే మాత్రమే ఈ అవార్డు లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

పిజి,యుజి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం బెంగళూరు, భోపాల్ క్యాంపస్‌లలో పీజీ, యుజీ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ ప్రతినిధి. కె.ఎస్.రావు తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్ల ఫుల్‌టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అయిన ఎంఎ ఎడ్యుకేషన్, ఎంఎ డెవలప్‌మెంట్, మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఎంపిహెచ్), ఎంఎ ఎకనామిక్స్, నాలుగేళ్ల ఫుల్‌టైమ్ రెసిడెన్షియల్ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. బిఎ ఆనర్స్, బిఎస్‌సి, ఆనర్స్, డ్యూయల్ డిగ్రీ బీఎస్సీ, బిఇడి ఉన్నాయి. ఫీల్డ్ ప్రాక్టీస్, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, మెంటార్డ్ ఫీల్డ్ ప్రాజెక్టల ద్వారా వాస్తవ-ప్రపంచ అనుభవం లోతుగా ఏకీకతం చేయబడేలా శిక్షణ వుంటుందని అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.